


అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు 2012

శ్రీమాతారవింద ప్రవచనములు

విషయసూచిక

జీవన విజ్ఞానం

అసలు సమస్య

అసలైన సమస్య యెప్పుడూ గూడా మనలోనే వుంది, మన చుట్టుప్రక్కల గాదు. మనుష్యులను అజేయులనుగా చేసే అంశాలు మూడు. అవి దివ్యసంకల్పం, పరమనిస్సంగత్వం, పరమ విశ్వాసం. మనల్ని మనం విముక్తం చేసుకొనేందుకు సంకల్పం వుండవచ్చు, కాని అవసరమైన సాధనోపాయాల నుపయోగించే సంకల్పం కొరవడవచ్చు. సంకల్ప విశ్వాసా లున్నప్పటికీ, మనం చేసే కర్మఫలితం మీద గాఢానురక్తితో, లేదా తీవ్రమైన ఏవగింపుతో, అంధ ఆవేశంతో, లేదా చెడు ప్రతిచర్యలకు కారణమయ్యే అనాలోచిత విధానంలో, బలప్రయోగంతో ఆ సాధనోపాయాలను మనం ఉపయోగించవచ్చు. అటువంటి ఎంతో మహనీయ కార్యాన్ని నిర్వహించడంలో ముందు ముందు తెలియకుండా యెదురయ్యే అడ్డంకులను అధిగమించడానికి, మనస్సు, దేహాలకు సంబంధించిన శక్తికన్న ఉన్నతతరమైన శక్తిని ఆశ్రయించాలి. ఇది సాధన కవసరం.

ఒక సర్వశక్తివంతమైన, సర్వవ్యాపియైన, సర్వజ్ఞమైన మహాశక్తిగల భగవంతుడు మన లోపలే ఉన్నాడు. మనము, ఆయన ఒకే ప్రకృతిగలవారము. మనము ఆయనతో సంబంధాన్నేర్పరచుకొని, మనల్ని మనం ఆయన హస్తాల్లో పెట్టుకొన్నపుడు, మన లోనికి ఆయన స్వకీయ క్రియాశక్తిని గ్రుమ్మరిస్తాడు. దివ్యత్వంలో మనకూ వాటా వున్నదనీ, సర్వశక్తిత్వం, సర్వవ్యాపకత్వం, సర్వజ్ఞత్వంలో మనకూ భాగమున్నదనే నిజాన్ని తెలుసుకొంటాం. మార్గం సుదీర్ఘమైనదే, కాని, ఆత్మార్పణ దానిని కుదిస్తుంది. మార్గం కష్టభూయిష్టం, కాని పరిపూర్ణ విశ్వాసం దాన్ని సుగమం చేస్తుంది.

సంకల్పం సర్వశక్తివంతమైనదే, కాని అది దివ్యసంకల్పమై, నిస్వార్థమై, ప్రశాంతమై, ఫలితాల యెడల పట్టుబట్టకుండా వుండాలి. "ఆవగింజంత పరిపూర్ణ విశ్వాసం ఉన్నా, పర్వతమైనా 'కదలిరా' అంటే అది నీ దగ్గర కొస్తుంది" అని జీసస్ చెప్పాడు. పరమ విశ్వాసం అంటే అర్థం యేమిటి? పరిపూర్ణ శ్రద్ధతో పాటు వుండే దివ్యసంకల్పం అని అసలైన అర్థం. శ్రద్ధ తర్కించదు, తెలుసుకొంటుంది. ఎందుచేతనంటే అది దృష్టిని శాసించి భగవంతుని సంకల్పాన్ని దర్శిస్తుంది. అంతే కాదు భగవంతుని సంకల్పమేదో అదే జరుగుతుందని దానికి తెలుసు. అంధశ్రద్ధను గాక ఆధ్యాత్మిక దృష్టిని ఉపయోగిస్తూ సర్వజ్ఞత్వాన్ని సంతరించుకోగలదు.

సంకల్పం సర్వవ్యాపి కూడా. దానితో దేనికి సంపర్కం కలిగినా, దాన్లోకి అది దిగివస్తుంది. తన శక్తిని, తన భావాన్ని తన ఉత్సాహాలకు పట్టుదలలకు సంబంధించిన అంశాన్ని తాత్కాలికంగానో, శాశ్వతంగానో దానికి ఇచ్చివేస్తుంది. నిస్వార్థమైన, నిస్సంశయాత్మకమైన దైవసంకల్పాన్ని ప్రయోగించడం ద్వారా ఒకే ఒక్క మనిషి ఆలోచన, జాతికి సంబంధించిన ఆలోచనగా ప్రకటితమౌతుంది. ఒకే ఒక్క వీరయోధుని సంకల్పం లక్షలాది పిరికిపందల హృదయాల్లో ధైర్యాన్ని నింపుతుంది.

మనం నిర్వహించవలసిన మన ముందున్న కార్యం, ఒక పర్వతాన్ని కదలించడం కంటె తక్కువ కష్టమైనదేం కాదు. మనం సాధించుకోవలసిన సాధన యిదే. మన విమోచనానికిదే నియమం. అయినప్పటికీ, ఒక అపరిపూర్ణ సంకల్పాన్ని అపరిపూర్ణ విశ్వాసంతో, అపరిపూర్ణ నిస్సంగత్వంతో మనం ఉపయోగిస్తూ వస్తున్నాం.

దాన్ని సాధించగల క్రియాశక్తి వున్నది. కాని అది మనలోనే ఒక రహస్య గదిలో దాగి వుంది. ఆ గది తాళంచెవిని భగవంతుడు తన దగ్గర ఉంచుకొన్నాడు. ఆయనెక్కడున్నాడో వెదికి పట్టుకొని ఆ తాళంచెవి మీద మన హక్కును ప్రకటిద్దాం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

వైశ్వప్రకృతి అచేతనమైనది కాదు — వైశ్వప్రకృతి రహస్యం

వైశ్వప్రకృతి ఉద్దేశ్యమా? అది శ్రీఅరబిందో చెప్పినదే...

లోలోతుల్లో దాగి, పదార్ధకేంద్రంలో భగవంతుడి సన్నిధి వున్నది. ఈ సృష్టిని తన మూలస్థానానికి.... ఈ సమస్తంలోని ప్రతిదీ తన కేంద్రంలో వున్న, దైవసన్నిధికి తిరిగి చేరేందుకై దానిని సంసిద్ధపరచడానికే ఈ భూపరిణామం జరుగుతున్నది. అదే వైశ్వప్రకృతి ఉద్దేశ్యం.

పరాత్పరుడు తనను తనకు వస్తువుగా చూపుకొనగా యేర్పడినదే ఈ జగత్తు. తనను తాను చూచుకొనుటకు, తనుగా జీవించుటకు, తనను తాను తెలుసుకొనుటకు, తనను తనకు వెలుపల, తననే వస్తువుగా విషయంగా చేసుకొనగా తయారైనదే ఈ జగత్తు. అలా జరగాలంటే, తమ ఆది మూలం పరాత్పరుడే అని గ్రహించి ఆతనిని ఈ, పురోగమిస్తూ మారుతున్న సృష్టి యందు అభివ్యక్తం చేయడానికి, ఆతనితో, యెరుకతో మమేకమయ్యే సామర్థ్యం కల ఒక సృష్టి, ఒక చేతన ఉండి తీరవలసిన ఆవశ్యకత ఉన్నది. అందుకే ఈ జగత్తు, కనుక జగత్తు అస్తిత్వానికి అంతకు మించి మరే కారణం లేదు.

పరిణామ ప్రక్రియ పరంపరగా కొనసాగడం సుగమమయ్యేందుకు అనువైన రీతి వైశ్వప్రాణశక్తి యొక్క ఒక రకమైన ప్రతీకాత్మక ఘనీభవనం, ఒక మదింపు, ఒక కేంద్రీకరణ ఈ భూమి. ఈ పృథ్వీ చరిత్రను చూచినట్లయితే ఈ విశ్వం ఎందుకు సృజింపబడిందో, బాగా అర్థమౌతుంది. నిత్యనిరంతర అభివ్యక్తి ప్రక్రియలో తనను తాను తెలుసుకోవడంలో యెదుగుతూన్నది పరాత్పరుడే. దీని లక్ష్యం సృష్టించబడినది సృష్టికర్తతో ఏకమవ్వడం, ఈ అభివ్యక్త సృష్టిలో ఆ కలయిక సచైతనమైనది, ఐచ్ఛికమైనది, స్వతంత్రమైనది గావడం. ఇదే ప్రకృతి రహస్యం.

ప్రకృతి అంటే కార్యనిర్వాహక క్రియాశక్తి. కార్యాన్ని నిర్వహించేది ఆమెయే. ఆమె సృష్టిని చేబూనుతుంది. ఈ సృష్టిని చూస్తే, పూర్తిగా నిశ్చేతనగా కనబడుతున్నది. కానీ ఇదే పరాత్పర చేతనను ఏకైక అభివ్యక్త పరమసత్యాన్నీ నైజాన్నీ కల్గి వున్నది. ఈ సృష్టి అంతా వికాసం చెంది, తనను తాను పూర్తిగా గ్రహించి, సంపూర్ణంగా తనను తాను నిజం చేసుకొనేటట్లు, ఆమె పనిచేస్తుంది.

కానీ దీనినంతా తొలుదొల్త నుండీ బహిరంగంగా జేయదు. దానిని దశలవారీగా పెంపొందిస్తుంది. అందుకే ఇది మొదట్లో రహస్యంగా వుండి... చివరికొచ్చే కొద్దీ దీని తెర తొలగిపోతుంటుంది. ఈ రహస్యానికి తెర తొలిగిపోయేందుకు ఈ పరిణామంలో కావలసినంత ఎత్తైన స్థాయికి మనిషి చేరుకొన్నాడు. దేనికోసమైతే ఈ నిశ్చేతనలో చేయబడిందో అది యిప్పుడు సచేతనంగా, యిష్టంగా చేయబడుతుంది కాబట్టి సాక్షాత్కార ఆనందంలో వేగవంతంగా జరగాలి. మనిషిలో ఒక ఆధ్యాత్మిక నిజతత్త్వం అభివృద్ధి చెందుతున్నట్లు మనం యిప్పటికే చూడొచ్చు. అది తనను తాను సంపూర్ణంగా స్వేచ్ఛగా అభివ్యక్తపర్చుకోబోతున్నది. ఇతడి కంటే ముందు జంతువులోనూ, మొక్కలోనూ, అది జరిగింది. దానిని పరికించాలంటే ఎంతో సునిశిత దృష్టి అవసరమయ్యింది. కాని ఈ ఆధ్యాత్మిక సత్యం యొక్క యెరుక స్వతహాగా మనిషికి ఉన్నది. కనీసం అది మానవ మనుగడలో ఉత్తమ భాగంలో ఉన్నది. పరమమోత్కృష్ట మూలము తన నుండి ఏమి కోరుతున్నాడో, తెలుసుకొని దానిని మూలము కొనసాగించడానికి సహకరించడం మొదలుపెడ్తున్నాడు. తనకు తనను వస్తువుగా చేసుకొన్న సృష్టికర్తయే సృష్టిఅని సృష్టికీ సృష్టికర్తకీ తేడా అన్నది లేదనీసృష్ఠి యెరుగగలట్లు ఈ సృష్టితయారుగావాలనిప్రకృతి కోరుతుంది. ఉన్న సృష్టి లక్ష్యం సచేతనమైన అనుభవైకమైన ఏకత్వం ఇదే విశ్వప్రకృతి రహస్యం.

ప్రకృతి అచేతనమైనది కాదు. కానీ ఆమె అచేతనగా కన్పించే ఆకారాన్ని ధరించింది. అది నిశ్చేతనతోనే మొదలయ్యింది. కానీ ఈ నిశ్చేతన లోతుల్లో చేతన వున్నది. అది దశలవారిగా అభివృద్ధి చెందుతోంది. ఉదాహరణకి ఎంతో దగ్గరగా పరిశీలించినప్పటికీ ఖనిజ స్వభావం, శిలలు, మట్టి, లోహాలు, నీరు గాలి ఈ అన్నీ పూర్తిగా అచేతనమైనవిగా కన్పిస్తాయి. కాని ఇదంతా బయటకు కనిపించే రూపమేననీ, కేంద్రీకృతమైన శక్తి అనీ దీన్నంతటినీ ఉత్పత్తి చేసినది వాస్తవానికి ఒక సచేతన శక్తి అనీ విజ్ఞానశాస్త్రం ఇపుడు బయట పెడ్తున్నది. మనం ఒక బండరాయిని కనుక చూస్తే అది సచేతనమైనదనే అనుకోము. అది కూడ చేతనతో ఉన్నాననన్న అభిప్రాయాన్ని మనలో కల్గించదు. పైపెచ్చు పూర్తిగా జడంగా కనిపిస్తుంది.

పై రూపమేదైతే ఉన్నదో అది నిశ్చేతనం. అదే అంతకంతకూ సచేతనమౌతుంది. ఖనిజ సీమలలో గుప్త చేతనను కొన్ని రకాలైన స్ఫటికాలలో లాగా వ్యక్తపరచే

ప్రత్యక్ష ప్రమాణాలున్నాయి. ఏ విధంగా కచ్చితంగా, నిర్దిష్టంగా, సామరస్యంగా అవి రూపొందాయో కచ్చితంగా అదే విధంగా వాటి స్థాయికి దిగి, వాటికి స్పందించి గమనించినట్లయితే వాటి వెనుక ఒక చేతన పనిచేస్తున్నదనీ ఇది అచేతన కాకతాళీయ ఫలితం కాదనీ మీరు తప్పక అనుభూతి చెందుతారు.

మీరు రాతిస్ఫటికాలను చూచారా? శిలాస్ఫటికాలను అస్సలు చూడలేదా మీరు? అది ఎంత బాగుంటుంది. నిజంగా ఎంతో కళాత్మకంగా వుంటుంది. సముద్రపు కదలికలు, గాలి చలనాలు, పిల్లతెమ్మెరలు... వీటన్నిటి వెనుక ఒక చైతన్యం.... కాదు ఎన్నెన్నో చైతన్యాలు పనిచేస్తున్నాయి అని సంవేదించకుండా ఉండలేరు. కేవలం వీటి పైపొర మాత్రమే నిశ్చేతనం...

(నిశ్శబ్దం)

ప్రతి జీవిలో మొత్తం పరిణామ ప్రక్రియ పునరుత్పత్తి చేయబడుతోంది. అది కళ్ళు తిరిగిపోయే వేగంతో, జరిగిపోయినదంతా, మళ్ళీ సమీక్షిస్తున్నట్లుగా, మరో మెట్టు ఎక్కే ముందు మెరుపు వేగంతో పూర్వ పరిణామాన్నంతా మళ్ళీ జీవించి చూడడం అవసరమన్నట్లు ఉంటుంది.

(నిశ్శబ్దం)

ప్రారంభం. నిశ్చేతనంలో ఒక మహా యాత్ర, చీకటిలో, మరుపులో, అచేతనలో.... 10 వెలుగు వైపుకు వెనుదిరగడం....అది ఓ జాగృతి,...

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

ఈ ప్రకృతి కేవలం పరాత్పరుని సంకల్పం... తనను తానే విసిరివేసుకొన్న దివ్యభావన యొక్క అప్రతిహతమైన సత్యం అంతటినీ రూపంలో క్రియాశక్తిలో పరిణమింప జేయడానికి పనిచేస్తున్న దివ్యచేతనామయ పురుషుడి జ్ఞాన-శక్తి, ఇచ్ఛాశక్తి.

శ్రీఅరబిందో

వస్తువులనెలా ఉపయోగించాలి

ప్రశ్న: వస్తువులను మనం ఎలా ఉపయోగించుకోవాలి?

అవును.... ఇందుకు మనకు కావలసింది వస్తుపరిజ్ఞానం. వాటి సత్యప్రయోజనపు ఎరుక, వాటి వినియోగ నిజ అవగాహన, వాటి వాడకంలోని మెలకువలు, అవి చెడిపోకుండా ఉండేందుకు కావలసిన కచ్చితమైన జాగ్రత్తలు — ఇవన్నీ మనకు తెలిసి ఉండాలి.

ఉదాహరణకు ఒక కత్తెరను తీసుకుందాం. కత్తెరలు రకరకాలు. కాగితం కత్తిరించడానిక ఒక రకం కత్తెర ఉంటే దారం కత్తిరించడానికి మరో రకం కత్తెర ఉంటుంది. ఏది ఏ ఉపయోగం కొరకు తయారుచేయబడిందో దాన్ని అందుకు మాత్రమే వాడాలి. కాని మనం చూస్తుంటాం — వాటి భేదాలని గ్రహించకుండానే సిల్కుదారం మొదలు లోహపుతీగల వరకు ఒకే కత్తెరతో కత్తిరిస్తుంటారు. తుదకు రేకుడబ్బాలను తెరవడానికి కూడా అదే కత్తెర. ప్రత్యేకమైన పనిముట్టు అవసరమైన చోట కూడా దాన్నే ఉపయోగిస్తుంటారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఉదాహరణలు నేను ఎన్నైనా ఇవ్వగలను.

ఏదైనా వస్తువును వాడినప్పుడు అది అపరిశుభ్రం అవుతుంటుంది. ఆ కారణంగా అది చెడిపోతుంటుంది. శుభ్రపరచడం మరచిపోవడమో, నిర్లక్ష్యం వస్తువులను చేయడమో జరుగుతుంటుంది. శుభ్రపరచడానికి సమయం వెచ్చించాల్సి వుండటం కూడా ఒక కారణం కావచ్చు.

ప్రతి వస్తువుతో ఒక గౌరవ ధర్మం ముడిపడి వుంటుంది. తగు రీతిలో విచారించి, సక్రమంగా, వ్యవహరించి ఆ వస్తువును మనం కాపాడుకోవాలి. వీలైనంత కాలం భద్రపరచుకోవాలి. ఎందుకంటే ఆ వస్తువు గౌరవప్రదమైనది. దాని తయారీలో ఎంతో కృషి, ఎంతో శ్రమ వెచ్చించడం జరిగింది. ఆ వస్తువు కేవలం మనకు ఇష్టమైనందువవలన గాని, లేక అది మనం కోరుకున్నది కావడంవల్ల కాని కాకుండా దాని నిర్మాణం ప్రయత్నపూర్వక శ్రమతో కూడినది కనుక మనం దానిని గౌరవభావంతో చూడాలి.

కనీస అత్యవసర వస్తువులకు కూడా నోచుకోని, ఏమీ లేనివాళ్ళను నేను చూచాను. వాళ్లు ఏదో విధంగా కష్టపడి ఎంతో చాకచక్యంతో అవసరమైన వస్తువులను

తయారుచేసుకుంటారు. వ్యక్తిగత అవసరాలకై తయారుచేసుకొనక తప్పని పరిస్థితి వాళ్లది. ఆ విధంగా వాళ్లు స్వయంగా తయారుచేసుకున్న వస్తువులపై చూపే శ్రద్ధకు ఆశ్చర్యం వేస్తుంటుంది. వాళ్లకు ఆ వస్తువుల మీద అత్యంత శ్రద్ధాభక్తులు ఉంటాయి. ఎందుకంటే వాళ్లకు తెలుసు వాళ్లెంత కష్టాన్ని వెచ్చించవలసి వచ్చిందో. కాని డబ్బున్న కొందరు సంపన్నులు నిర్లక్ష్యంగా డబ్బులు పారేసి వాళ్లకు కావలసిన వస్తువులను కొనుక్కుంటారే కాని వాటికి విలువ నివ్వరు. నిర్లక్ష్యం చేస్తారు. ఇది వాళ్ళు తమకు తాము హాని చేసుకోవడమే అవుతుంది. అది ఒక చెడ్డ దృష్టాంతము కూడా.

*

ప్రభువు సర్వాంతర్యామి. మనం నిత్యం పారవేసుకునే వస్తువులలోనూ, ఎంతో విలువైనవిగా దాచుకునేవాటి లోనూ, అగౌరవంగా తొక్కివేసేవాటిలోనూ — అన్నింటిలోనూ అతను ఉన్నాడు అందుకే వాటిని గౌరవించడం మన జీవన ప్రాతిపదిక కావాలి. అలాంటి జీవితం గడపాలి. ఆతని సార్వత్రిక నిర్వికార సార్వభౌమత్వాన్ని, ఆతని నిత్యత్వ అస్తిత్వాన్ని మనం ఎన్నటికీ మరువకూడదు.

*

వాడుకుంటున్న వస్తువులను జాగ్రత్తగా చూచుకోకపోవడం అజ్ఞానం, అవిద్య. నీవు శ్రద్ధ చూపని ఏ వస్తువును నీవు ఉపయోగించుకునే అర్హత నీకు లేదు. నీ రాగబంధాల కారణంగా కాకుండా అన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న దైవత్వ చైతన్యలీల అంతటా ఆవరించి ఉన్నందువల్ల నీవు వాటిపై శ్రద్ధ చూపాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: నాగరాజు రామస్వామి

అస్వస్థత — భయము

మనలో భయం ఉండకూడదు. చాలా వరకు అనారోగ్యం వల్ల వచ్చే బాధలు భయం వల్ల వస్తాయి. నిజానికి తొంభైశాతం అనారోగ్యం మన శరీరంలోని అధోచేతనలో నిరంతరం ఉన్న భయం వల్ల వస్తుంది. మామూలుగా మన శరీర సామాన్య చైతన్యంలో కూడా స్వల్పమైన భౌతికమైన అసౌకర్యం కల్గినపుడు, దాని పర్యవసానం గురించిన ఎంతో భయం, కంగారు దాగి వుంటాయి. భవిష్యత్తు గురించి మన సందేహాన్ని ఈ విధంగా అనువాదం చేయవచ్చు, 'ఏం జరగబోతోంది?' ఈ ఆందోళన మనం చెక్ చేయాలి. ఈ ఆందోళనకు, భయానికి కారణం మనకి దివ్యకృపలో నమ్మకం లేకపోవడం. ఇది మన సమర్పణ సంపూర్ణంగా, సమగ్రంగా లేదని చెప్పడానికి కచ్చితమైన గుర్తు

ఈ అధోచేతనలో దాగివున్న భయం, ఏదో ఒక రకంగా పైకి కనిపించినప్పుడల్లా, మన అస్తిత్వంలోని జ్ఞానవంతమైన భాగం మిగిలిన శరీరానికి దైవం మీద సంపూర్ణ విశ్వాసం ఉండాలన్న ఆవశ్యకతను హత్తుకునేలా వివరించడం అన్నది ఒక ఆచరణీయ ఉపాయం. నిరంతరం ఆ దివ్యకృప నాలోను, నా చుట్టూ కూడా అత్యంత మేలు జరిగే విధంగా పనిచేస్తుందన్న దృఢ విశ్వాసం కూడా ఉండాలి. ఆ దివ్యసంకల్పానికి సంపూర్ణంగా, ఏ మినహాయింపులు లేకుండా అర్పించుకోవాలన్న నిశ్చయం కలిగి ఉండాలి.

ఈ శరీరం తన అంతస్సారంలో తను దివ్యమని తెల్సుకోవాలి, అంగీకరించాలి. ఆ దైవం యొక్క కార్యాచరణ మార్గంలో మనం అవరోధాలు సృష్టించకపోతే, మనకు ఏ హానీ జరగదు. ఆ భయాన్ని నీ లోంచి సమూలంగా నిర్మూలించే వరకు ఈ పద్ధతిని స్థిరంగా అనుసరించాలి. ఆ తరువాత ఒక వేళ ఆ అనారోగ్యం పైకి రావడంలో విజయం సాధించినా, దాని తీవ్రత, దాని కాలపరిమితి కనీసస్థాయిలో ఉంటుంది.

*

భౌతికమైన అసౌకర్యం వచ్చినపుడు, ఎవరూ భయపడకూడదు. దాన్నించి పారిపోకుండా, దాన్ని ధైర్యంతో, ప్రశాంతతతో నమ్మకంతో ఎదుర్కోవాలి. అస్వస్థత అన్నది అసత్యం యొక్క అభివ్యక్తి అని దృఢవిశ్వాసంతో ఉండాలి. ఆ దివ్యకృపపై

సంపూర్ణ నమ్మకంతో, సంపూర్ణ నిశ్చలత్వంతో, ఆ దివ్యకృప వైపు తిరిగినపుడు, ఆ జీవకణాల అస్తిత్వ లోతుల్లో ఆ భావం స్థిరపడుతుంది. అప్పుడా జీవకణాలు కూడా ఆ శాశ్వత సత్యంతో, ఆనందంలో భాగం పంచుకుంటాయి.

*

నిజమైన రుగ్మత భయమే. భయాన్ని దూరంగా తరిమేస్తే, రోగం కూడా తనంతట తాను పోతుంది.

నిజమైన రుగ్మతా భయాన్ని దూరంగా తరిమేస్తే, రోగం భయపడి పారిపోతుంది.

*

మనకేదైనా అనారోగ్యం వస్తే, అనారోగ్యాన్ని ఎంతో భయంతో, ఆందోళనతో జాగ్రత్తగా చూసుకుంటారు. మన అసలైన రక్షకుడైన ఆ ఒక్కడి సహాయం తీసుకోవడం నీవు మర్చిపోయేంతగా నీ యెడల ఎంతో శ్రద్ధ చూపిస్తారు. ఈ విధంగా నువ్వు ఒక విషవలయంలో చిక్కుకుని, నీ అనారోగ్యం గురించిన అనారోగ్య ఆసక్తి కలిగి ఉంటావు.

*

ప్రశ్న: మధుమయి మాతా! అనారోగ్యం వస్తుందన్న సూచన గమనించినపుడు, దాన్నెలా ఆపుచేయగలం?

ప్రప్రథమంగా నీవు గాని, నీ శరీరంలోని ఏ భాగము దాన్ని కోరుకోకూడదు. నేను అస్వస్థతను అంగీకరించనన్న గట్టి సంకల్పం ఉండాలి. ఇది మొదటి షరతు.

రెండవ షరతు, ఆ ప్రకాశాన్ని ఆహ్వానించడం తాటస్థ్యపు ప్రకాశం, శాంతి ప్రకాశం, ప్రశాంతత, సమతుల్యతను ఆహ్వానించడమే కాదు, దాన్ని ప్రతి జీవకణంలోకి జొప్పించి, ఆ తరువాత భయపడొద్దని వాటిని నిర్దేశించాలి. ఎందుకంటే అది మళ్లీ మరొక పరిస్థితి.

మొదట నువ్వు అస్వస్థతను వద్దనుకోవాలి, అస్వస్థత గురించి భయపడకుండా ఉండాలి. నువ్వు దాన్ని ఆకర్షించకూడదు. బెదిరి ఒణికిపోకూడదు. నువ్వసలు ఆ అనారోగ్యం అన్నదాన్ని ఏ రకంగాను కోరకూడదు. కాని నీవు భయంవల్ల దాన్ని కోరకపోవడం కాదు. అసలు భయపడకూడదు. నీలో ఒక ప్రశాంతమైన ధృఢవిశ్వాసం, ఆ కృపయొక్క శక్తి మీద అపారమైన విశ్వాసం ఉండాలి. అది ఏ బాధా నిన్ను తాకకుండా, నీకు శోకకుండా, నిరంతరం నీడ నిచ్చి నిన్ను కాపాడుతుందని భావించాలి.

ఆ తరువాత నీ ఆలోచనను మరో విషయం పైకి, పూర్తిగా దీనికి సంబంధించని విషయం పైకి, మళ్లించాలి. ఈ రెండు విషయాలు పాటించాక, అంటే నీ పూర్తి సంకల్పంతో ఈ అనారోగ్యాన్ని తిరస్కరించడం, శరీర జీవకణాల్లో సమూలంగా భయాన్ని నివారించడానికి వాటిల్లో నమ్మకం కల్గించడం, ఆ తరువాత ఈ ఆలోచనను మరో విషయం వైపు మళ్ళించి, ఆ అస్వస్థత ఉందన్న విషయం సంపూర్ణంగా మర్చిపోవడం... అది ఎలా చేయాలో తెలిస్తే, నీవు అనారోగ్యంతో, అంటువ్యాధులతో బాధపడే రోగుల మధ్య ఉన్నా, నీ కవి ఏమాత్రం అంటవు. దీన్ని ఏ విధంగా చేయాలో దాన్ని తెలుసుకోవాలి.

చాలామంది "అవును, నేనీ విషయంలో భయపడను" అంటూ చెప్తారు. వాళ్ళకి మనసులో ఏ భయం లేదు. వారి మనసుకు ఏ భయం సోకదు, అది శక్తివంతమైనదే. కాని శరీరం వణుకుతుంది, అది మనకు తెలియదు. ఎందుకంటే ఆ వణుకు ఉండేది శరీరం యొక్క జీవకణాల్లో. అది భయభ్రాంతమైన ఆందోళనతో వణుకుతుంది, అదే అనారోగ్యాన్ని ఆకర్షిస్తుంది. అక్కడే ఆ ప్రశాంతమైన, నిశ్చలమైన సంపూర్ణ, సమగ్ర విశ్వాసాన్ని ఆ కృపపై ఉంచాలి. ఇంకొక్కప్పుడు మరో విధంగా జరుగుతుంది, నువ్వు అదే శక్తివంతమైన ఆలోచనతో ఆ సూచన లన్నింటినీ తోసిపుచ్చుతావు, మరో రకమైన ఆలోచనలను ప్రోత్సహిస్తావు. ఈ భౌతిక ప్రపంచమంతా అనారోగ్యంతో కూడి ఉంటుంది, అవన్నీ అంటువ్యాధులే, అనారోగ్యంతో ఉన్న వ్యక్తి సమీపంలోకి వెళ్తే అది తప్పక అంటుకుంటుంది. అందువల్ల ఈ అంతరంగ సాధనాలు శక్తివంతంగా శరీరంపై పనిచేయలేవు, మన చుట్టు ఉన్న తెలివితక్కువ విషయాలు వాటి ప్రభావం చూపుతాయి, అని... తలపోస్తావు. ఇవి ఒక వ్యక్తి నించి మరో వ్యక్తికి చేరుతూ, అందరిచేత వ్యాప్తి చేయబడే సామూహిక సూచనలు. అనుకోకుండా అక్కడ ఒకళ్ళో, ఇద్దరో డాక్టర్లు ఉంటే ఆ దాడి భరించలేం... (నవ్వు)

మానసిక, ప్రాణిక, భౌతిక భయం

మానసిక, ప్రాణిక, మరియు భౌతికమైన భయం. సామాన్య దృష్టితో చూస్తే చాలా వరకు అనేకమందిలో ఈ భయమే — భయం అది మానసికం కావచ్చు, ప్రాణికం కావచ్చు, కాని ఎప్పుడూ ఎక్కువగా భౌతికమైన భయం, జీవకణాలలోని భయం

— ఆ భయమే అన్ని అంటువ్యాధులకు తలుపులు తెరుస్తుంది. మానసిక భయం — కొంచెం మనసు మీద నిగ్రహం ఉండి, మానవ హుందాతనం ఉన్నవారు దీన్ని నిర్మూలించగలరు. ప్రాణికభయం మరింత సూక్ష్మమైనది, అందువల్ల మరింత నిగ్రహాన్ని కోరుతుంది. ఇంక భౌతికమైన భయానికొస్తే, దీన్నధిగమించడానికి ఓ నిజమైన యోగం ఆవశ్యకత ఉంది. ఎందుకంటే ఈ శరీరంలోని జీవకణాలు, వాటికి ఇంపుగా కనిపించనివి, బాధ కల్గించేవి, ఏ చిన్న అసౌకర్యం కలుగచేసేవి, అవెంత చిన్నవైనా సరే భరించలేవు. ఆందోళన చెందుతాయి. దానినధిగమించడానికి ఎరుకగల సంకల్పపు నియంత్రణ అవసరం అవుతుంది. నిజానికి ఇలాంటి భయమే అస్వస్థతకు తలుపులు తెరుస్తుంది. నేను ఆ మొదటి రెండు భయాల గురించి మాట్లాడటం లేదు. ఎందుకంటే అది ఏ మానవుడైనా, ఉత్తమ మానవుడిగా ఉండాలంటే ఆ రెండింటిని అధిగమించాలి. ఎందుకనంటే అది పిరికితనం గనుక. కాని భౌతికమైన భయాన్ని అధిగమించడం చాలా కష్టం. ఆ భయం లేకపోతే, అత్యంత ఉధృతమైన దాడుల్ని కూడా తిప్పికొట్టవచ్చు. ఎవరికైనా తన శరీరం మీద అతి స్వల్పమైన నిగ్రహం ఉన్నా ఆ ప్రభావాలను తగ్గించవచ్చు. కాని అది రోగనిరోధకశక్తి కాదు. ఈ రకమైన పదార్థ సంబంధమైన కంపనం, శరీర జీవకణాల్లోని భౌతికమైన భయం ఆ అనారోగ్యాన్ని అంత ప్రకోపింపచేస్తుంది.

కొందరు సహజంగానే ఈ శరీరపరంగా ఉన్న భయంనించి కూడా దూరంగా ఉంటారు. వారికి చాలినంత ప్రాణిక సంతులనం ఉంటుంది, అది భయం లేకుండా చేస్తుంది. ఆందోళనకు దూరంగా ఉంచుతుంది. వారి భౌతికజీవనంలో సహజమైన సమతుల్యమైన 'లయ' ఉంటుంది. అందువల్ల వారు అనారోగ్యాన్ని చాలా వరకు వెంటనే తగ్గించుకోగలరు. మరో రకమైన వాళ్ళుంటారు. వారికి ప్రతి విషయం మరింత చెడుగా పరిణమిస్తుంది, అది ఒక్కసారి విషాదానికి దారితీస్తుంది. మొత్తం అనేక రకాలు, అన్నీ తేలికగా కనిపిస్తూనే ఉంటాయి. సరే: ఇవి వారిలోని ప్రాణ కదలికలోని ఆనందకరమైన 'లయ' మీద ఆధారపడతాయి. అది బయటనించి వచ్చే అనారోగ్యదాడుల్ని ఎదుర్కోగలిగే సామరస్యతను కలిగి ఉండనైనా ఉంటుంది. లేక, అసలే లేకపోయి వుండవచ్చు, లేదా తగినంత శక్తివంతం కాకపోయి ఉన్నప్పుడు, అది భయాందోళనలతో నిండిపోయి, ఓ సహజాతమైన తీవ్రబాధతో, ఏ చిన్న అసౌకర్యాన్నైనా ఒక అపాయకరమైన విషయంగా మార్చడమూ జరుగుతుంది.

ఇలా అనేక రకాలుగా పనిచేస్తుంది. కొందరు అత్యంత భయంకరమైన అంటువ్యాధుల మధ్య ఉంటూ కూడ, కొంచెమైనా ఆ గాలి శోకకుండా ఉంటారు. కొందరు అతి చిన్న విషయానికే అస్వస్థులౌతారు. సహజంగా ఇదంతా ప్రతివ్యక్తి యొక్క శరీరతత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఎవరి అభివృద్ధి అయినా, సహజంగా వారి మీద వారికున్న స్వీయ నిగ్రహశక్తి మీద ఆధారపడి ఉంటుంది. ఆ ఉన్నత దివ్యసంకల్పం చేతిలో నిరాడంబరమైన పనిముట్టుగా తయారయ్యేంత వరకు, అన్ని దాడుల్ని తట్టుకునే శక్తిని దాని నుండి పొందేంతవరకు, అతని మీద అతనికున్న స్వీయనియంత్రణ మీద అది ఆధారపడి ఉంటుంది.

భయం లేకుండా చేసుకోగలిగితే, అతడు దాదాపు సురక్షితుడైనట్లే. ఉదా: మహోపద్రవాలు, లేదా మహోపద్రవాలు అని మనం చెప్పుకొనేవి, ప్రస్తుతం చెలరేగుతున్నటువంటివి – వాటిల్లో నూటికి, తొంభైతొమ్మిది భయం వల్లే దాపురిస్తాయి. వార్తాపత్రికల్లోని వ్యాసాలు, కాలక్షేపం కబుర్లు లాంటి వాటితో బలం పుంజుకొని, ఒక భయం అతి నికృష్ట రూపమానసిక భయంగా రూపుదాలుస్తుంది.

*

ప్రశ్న: భయం వల్ల అనారోగ్యం వస్తుందా?

అవును. నాకు తెలిసిన ఒకతనికి చాలా భయపడ్డం వల్ల కలరా సోకింది. అతడి పక్కింట్లో కలరా ఉంది, దానితో అతడు, తనకూ అంటుకుంటుందని చాలా భయపడ్డాడు. అతడు భయపడినట్టుగానే, మరే కారణం లేకపోయినా, అతడికి కలరా వ్యాధి సోకింది. ఆ వ్యాధి అతడికి రావడానికి ఒక్క భయం తప్ప మరే కారణంలేదు. అదే సామాన్యంగా జరుగుతూ ఉంటుంది. అంటువ్యాధులు ప్రబలినప్పుడు చాలా ఎక్కువమంది విషయంలో ఆ భయంవల్లే వ్యాధి శోకుతుంది. నీలోని భయం తలుపురలు తెరిచి ఆ అనారోగ్యాన్ని ఆహ్వానిస్తుంది. భయం లేనివాళ్లు స్వేచ్ఛగా తిరిగినా వారికేదీ అంటదు. కాని నేనింతకు ముందు చెప్పినట్టు, నీకు మనసులో భయం లేకపోవచ్చు, ప్రాణికంలో భయం లేకపోవచ్చు. కాని శరీరంలో భయం లేనివాళ్ళెందరు?... చాలా కొద్దిమంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డి సత్యవాణి

స్నేహితుల గురించి యువకులకు ఉపదేశము

...నేను వ్రాసిన ఒక విషయాన్ని గురించి ఒకతను ప్రశ్నించాడు — పవిత్రా! నీ దగ్గర అది ఉన్నదా? ఏదీ ఒకసారి చదివి వినిపించు. పవిత్ర "మనలో బాగా మంచిగా ఉన్నదాన్ని ఎవరైతే ప్రేమిస్తారో, అయినా గూడా మనని ఉన్నట్లుగా గాక ఇంకో రకంగా ఉండమని అడగకుండా ఉంటారో వారే మంచి మిత్రులు."

(మాతృవాక్కులు *CWM* Vol. 14, p. 288)

వారు దాన్ని వివరించమని కోరారు. ఎన్ని రకాల అసంబద్ధంగా ఉండే విషయాలనైనా నేను చెప్పగలను. అయినప్పటికీ...

మామూలుగా మరిచిపోయే విషయమేదో నా మనస్సులో ఉన్నందున దీన్ని వ్రాసాను. సాధారణంగా అందరూ వారి స్నేహితులనుగానీ, పరిచితులనుగానీ వారున్న పద్ధతిలో గాకుండా తమకు నచ్చే పద్ధతిలో ఉండమని అడుగుతారు.... వారు మనస్సులో ఒక ఆదర్శాన్ని ఏర్పరుచుకొని దాన్ని అందరికీ వర్తింప చేయాలనుకుంటారు. ఈ సందర్భంలో నాకు టాల్‌స్టాయి కుమారుడు గుర్తుకు వస్తున్నాడు. అతన్ని నేను జపాన్‌లో కలిశాను. మానవులందరినీ ఒకటి కలపాలని అతను ప్రపంచ పర్యటన చేస్తున్నాడు. అతని ఉద్దేశం చాలా గొప్పగా ఉంది. కానీ అతను ఎంచుకున్న విధానం అంత బాగా లేదు. అతను చాలా దృఢంగా, గంభీరంగా చెప్పాడు: ప్రపంచవాసులంతా ఒకే భాష మాట్లాడుతూ, ఒకే రకంగా తింటూ, ఒకే రకంగా వేషధారణ చేస్తూ, ఒకే నడవడిని కలిగి ఉంటే తప్పనిసరిగా ఐక్యతవచ్చి తీరుతుంది అని, దీన్నిసాధించడానికి ఏవిధమైన ప్రయత్నాలు చేస్తావని అడిగినప్పుడు అతను ఈ విధంగానే దేశాలు తిరుగుతూ ఒక క్రొత్త సార్వత్రిక భాషను ప్రచారం చేస్తూ, ఒక క్రొత్త సార్వత్రిక వేషధారణను, సార్వత్రిక అలవాట్లను నేర్పిస్తూ ఉంటే సరిపోతుందని చెప్పాడు... తను అలాగే చేస్తానని చెప్పాడు! (శ్రీమాత నవ్వుతూ ఇలా అన్నారు) ప్రతివారూ వారి అల్పపరిధిలో అలాగే ఉంటారు. అతనికి ఒక ఆదర్శం ఉంటుంది. సత్యమైన, సుందరమైన ఉదాత్తమైన దివ్యం కూడా అయిన భావన ఉంటుంది. ఈ భావనను అందరిచేత అనుసరింపచేయాలనుకుంటాడు. ఇలా చాలామందికి దైవమంటే కూడా ఒక రకమైన అభిప్రాయం

ఉంటుంది. తమ అభిప్రాయాన్ని దైవంపై విధించాలని శాయశక్తులా ప్రయత్నించేవారు చాలామంది ఉన్నారు. వారి ప్రాణాలు పోయేదాకా మామూలుగా వాళ్ళు నిరాశ చెందరు.

...ఎవరికైనా ఇతరులపై కొన్ని అభిప్రాయాలుండి, వారి జీవిత విధానం వీరికి నచ్చనప్పుడు దానిక్కారణం వారి ప్రవర్తన తాము అనుకున్నట్లుగా లేకపోవడమే. మనం ఒక విషయం మరిచిపోకూడదు: ఈ విశ్వంలో ఏ రెండు వస్తువులు ఒకే విధంగా ఉండవు. రెండు ఒకే విధంగా ఉన్నప్పుడు ఆ రెండవదాని అవసరం ఏముంది? ఒక అనంత బహుత్వం మధ్య సామరస్య సిద్ధికై ఈ విశ్వం ఏర్పడింది. అందులో ఏ రెండు చలనాలుగానీ ఏ రెండు చైతన్యాలు ఇంకా ఎక్కువగానీ ఒకే విధంగా ఉండవు. అటువంటప్పుడు మనం మధ్యలో కలుగచేసుకునే హక్కుగానీ, మన ఆలోచనలకు సరితూగేటట్లే ఎదుటివారు ఉండాలనుకొనే హక్కుగానీ మనకేముంది?... ఎందువల్లనంటే మనం ఒక విధంగా ఆలోచించేటప్పుడు ఎదుటివారూ ఆలోచనాసరళి అలాగే ఉండాలని మనం అనుకోకూడదు. నీవు ఒక తరహా మనిషివైతే ఎదుటివారు అదే తరహాకి చెంది ఉండరు. నువ్వు తెలుసుకోవలసింది ఏమిటంటే ప్రపంచంలో చెదిరిపోయి ఉన్న వస్తువుల నన్నిటినీ సామరస్యపరచి, సమన్వయపరచి దేని స్థానంలో దాన్ని ఉంచడం. ఏకరూపకతలో సామరస్యం లేదుగానీ, దేని స్థానంలో దాన్ని నిలిపి సామరస్యం సాధించినప్పుడే ఏకత్వం సిద్ధిస్తుంది.

ఒక స్నేహితుని దగ్గర నుంచి ఏదైనా ఆశించే హక్కు ఉందనుకుంటే ఇదే నీ ప్రతిస్పందనకి ప్రాతిపదికగా ఉండాలి. అంటే ఆ స్నేహితుడు తన మాదిరే ఉండాలనుకోకుండా అతనిని అతనుగానే ఉండనివ్వాలి.

నేను మొదట్లో చెప్పినట్లుగా "అతను నీలో ఉన్న ఉత్కృష్టతను ప్రేమిస్తాడు"... అనే దాన్ని ఇంకా సానుకూలంగా చెప్పాలంటే: ఒక మంచి స్నేహితుడు దిగజార్చే పనులను, బుద్ధితక్కువ పనులను తనతోబాటు చేయమని ప్రోత్సహించడు, తనతో బాటు చెడుమార్గాల్లోకి దించడు. నీవు చేసే వెధవ పనులకు నిన్ను మెచ్చడు. అంతవరకూ చెప్పవచ్చు. కానీ సర్వసాధారణంగా, మరీ తరచుగా ఎక్కువగానే కొంతమందితో స్నేహం చేస్తావు; అతనితోపాటు నైచ్యానికి దిగజారినా కూడా నీలో ఆశాంతి కలుగదు; తప్పుడు పనులు చేయడంలో సహకరించేవారినే తమ ముఖ్య నేస్తాలనుకుంటారు, స్కూలు కెళ్ళకుండా వీధులు పట్టి తిరుగుతూ తోటల్లో

పళ్ళు దొంగిలిస్తూ టీచర్లను గేలిచేస్తూ తిరిగేవారితోనే జట్టు కడతారు. అందువల్లనే నేను అలా చెప్పాను. "వారు నీ నిజమైన స్నేహితులు కారు." అయినప్పటికీ వారితోనే నీకు సదుపాయంగా ఉంటుంది; ఎందువల్లనంటే నీవు తప్పుచేస్తున్న భావన నీకు కలుగనీయరు. ఎవరైనా వచ్చి నీకు మంచి చెప్పబోతే: "అల్లా జులాయిగా వీధులు పట్టి వెధవ పనులు చేస్తూ తిరక్కపోతే క్లాసులకి వస్తే ఉపయోగంగా ఉంటుందని అనిపించటం లేదా!" అంటే దానికి నీవు 'నన్ను విసిగించకు'! నీవేమీ నా మిత్రుడవు కాదు కదా!" అంటావు.

ఇక్కడ కొంతమంది పిల్లలు చాలా అభివృద్ధి దిశలో ఉన్నవారుండేవారు. వారు తరగతిలో కష్టపడి పనిచేస్తూ ప్రథమ శ్రేణిలో ఉండటం వల్ల నేను వారిపై చాలా ఆశలు పెట్టుకున్నాను. కానీ వారు ఈ తరహా స్నేహాల వల్ల పూర్తిగా పాడైపోయారు. ఈ రోజు ఆ విషయాలు చెప్పుకుంటున్నాం కాబట్టి ఈ విషయమై నేను బాధపడుతున్నాను. ఇప్పుడైతే అటువంటివారికి ఆ స్నేహితులను మిత్రులనుకోకుండా బద్ధశత్రువు లనుకొని అంటువ్యాధుల నుంచి కాపాడుకున్న విధంగా వారి బారి నుంచి రక్షించుకోవలసిందిగా చెపుతాను.

అంటువ్యాధులున్న వారిని దగ్గరకు చేరనీయకుండా జాగ్రత్తపడి ఆ అంటువ్యాధి ప్రబలకుండా వారిని వేరు చేస్తాము. దురలవాట్లు, దుష్ప్రవర్తన, దుర్మార్గము, దుర్నీతి, బూటక ప్రకృతి, నీచత్వము మొదలైనవి అంటువ్యాధుల కంటే ప్రమాదకరమైన జాడ్యాలు. వీటి నుంచి జాగ్రత్త పడాలి. నీకు మంచి స్నేహితులు ఎవరు అంటే ఎవరైతే జుగుప్సాకరమైన చెడ్డపనుల జోలికి వెళ్ళరో, తుచ్ఛమైన ఆకర్షణలకు లోబడకుండా నిన్ను కాపాడుతారో వారే స్నేహితులు. అటువంటివారితోనే కలవాలి కానీ సరదా మనిషి అని నీ చెడ్డగుణాలను బలపరిచేవారితో తిరగకూడదు. అదే నేను చెప్పేది.

ఎటొచ్చీ నీ కంటే విజ్ఞత కలవారితోనూ, ఎవరి సాన్నిహిత్యం వల్ల నిన్ను నీవు నియంత్రణ చేసుకొనే శక్తి నీకు వస్తుందో, నీ పురోగతి కొనసాగుతుందో, చక్కని దృక్పథంతో మెలగగలుగుతావో అటువంటి వారితోనే స్నేహం చేయాలి. తుదిమెరుపుగా నీకు చెప్పేదేమంటే నీ ముఖ్య స్నేహితుడుగా ఉండేది భగవంతుడు కాదా? ఆయనతో అయితే అన్నీ చెప్పుకోవచ్చు, ఏదీ దాచకుండా బయటపెట్టవచ్చు కదా! కరుణకు ఆలవాలమే ఆ భగవంతుడు, తప్పులను తిరిగి చేయనప్పుడు

వాటిని తుడిచిపెట్టేయగలడు*. సిద్ధిని పొందే మార్గం సుగమం చేయగలడు; అన్నిటినీ అర్థం చేసుకోగలడు, అన్నీ నివారణ చేయగలడు, మార్గంలో చేయూత నీయగలడు, నీవు తప్పిపోకుండా సహాయం చేస్తాడు, తప్పటడుగులు వేయకుండా, పడిపోకుండా నీ గమ్యం వైపు సూటిగా కొనసాగేటట్లు చేయగలడు. అతను నిజమైన మిత్రుడు, మంచిరోజుల్లోనూ, చెడురోజుల్లోనూ గూడా నీ నేస్తము, నిన్ను అర్థం చేసుకోగలడు, నీకు మేలు చేయగలడు, నీకు అవసరమొచ్చినప్పుడంతా నీ పక్కనే ఉంటాడు. నీవు మనస్ఫూర్తిగా పిలిస్తే వచ్చి నిన్ను నడిపించడానికీ, నిలబెట్టడానికీ సంసిద్ధంగా ఉంటాడు — యథార్థంగా నిన్ను ప్రేమించడానికి కూడా.

మూలం:శ్రీమాత (CWM 1st edition Vol. 9, pp. 54,55)
అనువాదం అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

---

* 1961 వ సంవత్సరంలో ఈ సంభాషణ వెలువరించినప్పుడు ఈ మాట మీద శ్రీమాత ఇలా వ్యాఖ్యానించారు. అవే తప్పులను తిరిగి తిరిగి చేసినప్పుడు ప్రతి నిమిషం దాన్ని అతను సృష్టిస్తూనే ఉంటాడు కాబట్టి దాన్ని పోగొట్టలేము. ఎవరైనా ఏదైనా తప్పు చేసినప్పుడు అది ఎటువంటిదైనప్పటికీ అతని జీవితంలో దాని పరిణామాలు ఉంటూనే ఉంటాయి. ఆ కర్మ పరిహారమయ్యేదాకా అంతే. కానీ భగవత్కృప పొందగలిగితే మాత్రం దానికా పర్యవసానాలను నిర్మూలించే శక్తి ఉంటుంది; అయితే ఆ తప్పును మళ్ళీ చేయకూడదు. తను మాత్రం అవే బుద్ధితక్కువ పనులు చేస్తూండవచ్చు; భగవత్కృప వాటి నన్నిటిని తప్పిస్తూంటుంది, అనేసుకోకూడదు. అది అలా జరగదు. జరిగినదంతా ఇంకా ఏమీ లేకుండా భవిష్యత్తుపై ప్రభావం ఏమాత్రం పడకుండా పూర్తిగా శుభ్రంగా పరిశుద్ధమైపోవచ్చు. కానీ ఒక షరతు ఏమిటంటే వారు దానిని నిత్యవర్తమానంగా మార్చకూడదు. ఆ దుష్టచలనాన్ని నీకు నీవే ఆపేయగలగాలి. అదే ప్రకంపనాలు మళ్ళీ మళ్ళీ ఉత్పన్నంకాకూడదు.

ఆధ్యాత్మిక ఘనవిజయం

(భువన చైతన్య పరివర్తనకై శ్రీఅరవిందులు చేస్తున్న సాధన 1926, నవంబరు 24 న మహాద్భుతమైన మలుపు తిరిగింది.[1] ఆనాడు "అధిమానస అధిదేవతాశక్తి" అవరోహించింది. అది భూమి ఎరుగని మహోన్నత శక్తి శ్రేణి. ఆ రోజును దివ్యజనని సిద్ధిదినంగా ప్రకటన చేశారు. అదే విజయ దినోత్సవం. ఈ శక్తిపాతం అతిమానసయోగ సాధనాపథంలో ఒక గొప్ప ముందడుగు అని దివ్యజననే చెప్పారు. ఈ సంఘటనను గురించి శ్రీఅరవిందుల వివరణ....)

24 వ తేది (1926 నవంబర్) భౌతికంలో శ్రీకృష్ణుడు అవతరించిన రోజు.

అతిమానస మహోజ్వల తేజస్సు కాదు శ్రీకృష్ణుడు. కృష్ణుని అవరోహణ అంటే అధిమనస్సు అధిదేవత అవరోహణ. శ్రీకృష్ణుని అవరోహణ, అతిమనస్సు ఆనందం అవరోహణకు సన్నద్ధం చేసింది. కాని శ్రీకృష్ణుని అవరోహణతో పాటు అతిమనస్సును తీసుకుని రావడం జరగలేదు. శ్రీకృష్ణుడు ఆనందమయ పురుషోత్తముడు. అధిమనస్సు ద్వారా ప్రకృతి పరిణామాన్ని ఆనందం వైపు నడిపిన మహనీయ అవతారం ఆయన.

*

24 నవంబరున జరిగిన దివ్యసంఘటన భూమిపై అతిమానస సిద్ధి అవరోహణకు సన్నద్ధం చేసింది. ఆ రోజునుండి శ్రీఅరవిందులు మరింత ఏకాంతంలోకి వెళ్లి, ప్రగాఢమైన, మహాశక్తివంతమైన ధ్యానంలో మునిగిపోయారు.
(1950, నవంబరు 20 న శ్రీఅరవిందులు ఈ మేరకు అనిల్ బరన్ తయారుచేసిన పత్రంపై సవరణ చేశారు.)

*

ప్రశ్న: మీరు నిద్ర, ఆకలి, వ్యాధి, మృత్యువును జయించినట్లు దత్త ఆ రోజున ప్రకటించింది. ఏ సాధికార ప్రజ్ఞతో ఆమె ఆ ప్రకటన చేసింది/

జ: ఈ మహాద్భుత ప్రకటన విషయం నాకు తెలియదు.

---

1 Overmind Godhead అధిమానస అధిదేవత

ఆనాడు దైవం (దానిని కృష్ణుడనవచ్చు, లేదా దైవసాన్నిధ్యం అనవచ్చు, ఏదైనా మీ ఇష్టం) భౌతికంలోకి దిగి వచ్చింది. ఇంకా సాధన చేయడానికై నేను ఏకాంతంలోకి ఉపసంహరించుకున్నట్లు కూడా ప్రకటించాను. ఒక వేళ అంతా నవంబరు 24 నే సాధించి వుంటే, అతిమానసం దిగివుంటే ఇక చేయవలసింది ఈ భూమిపై ఏమి మిగిలి వుంటుంది? మరేమంత ఘనప్రయోజనం కోసం నేను ఏకాంతం లోకి వెళ్లాలి? ఈ మహాసిద్ధి ఒక రోజులో లభించేదా?

దత్తా అలా అని వుంటే, భవిష్యత్ సాక్షాత్కార క్షణంలో, ఆవేశంతో అని వుండవచ్చు. భవిష్యత్తును వర్తమానంలో ఆమె చూసి వుండవచ్చు.

శ్రీఅరవిందులు

*

(1930 నవంబరు 24 న అనిల్‌బరన్ డైరీలో రాసిన విషయం)

దత్తా (దివ్యజననిని సేవించే ఐరిష్ దేశస్థురాలు) 1926 నవంబరు 24 న సాధనలో ఘనవిజయం గూర్చి ప్రకటన చేశారు. దాని సారాంశం: "ఆయన "(శ్రీఅరవిందులు) జీవితాన్ని జయించారు. మరణాన్ని జయించారు. సమస్తాన్ని జయించారు. శ్రీకృష్ణభగవానుడు అవతరించాడు." గతరాత్రి దివ్యజనని ఆ ప్రకటనకు అర్థం వివరించారు: శ్రీకృష్ణుడు అంతకు ముందు లేడని కాదు. నవంబరు 24 న అత్యంత భౌతిక పదార్థ లోతులలో అవతరించాడు. నవసృష్టి నిర్మాణ యజ్ఞాన్ని చేపట్టవలసిన కాలం ఆసన్నమైనదని తనకు తెలుసునని శ్రీఅరవిందులు అన్నారు.

ఆ రోజుల గూర్చి దివ్యజనని మాట్లాడుతూ, ఆనాటి వాతావరణం దివ్యావేశ ప్రదీప్తమై వుంది. దేవతల దివ్యభూమిక అధిమనస్సు భౌతిక శ్రేణితో అనుసంధానం చేయబడింది. ఈ అగ్నిస్పర్శ అవసరం లేకపోతే అతిమానస పరివర్తన సంభవమయ్యేది కాదు. ప్రస్తుతం సాధన మరో రంగంలో సాగుతోంది. అది అవసరం కాబట్టి.

అనువాదం: కె. యజ్ఞన్న

ఎ. బి. పురాణి నివేదిక

24 నవంబరు 1926 — సిద్ధిదినం

ఈ రోజు ప్రాముఖ్యతను గురించి అర్థం చేసుకోవాలంటే గతంలోని శ్రీఅరవిందుల 1908-1909 జైలు అనుభవాలను 24 నవంబరు 1926 అనుభవాలతో జోడించి చూడవలసిన ఆవశ్యకత ఉంది. శ్రీఅరవిందులు తన సాధన గురించి 1920 లో బరీన్‌కు వ్రాసినదానిని గూడా తప్పక పరిగణించవలసి ఉంది.

బరీన్‌కు ఏప్రియల్ 1920 లో శ్రీఅరవిందులు వ్రాసిన లేఖలో, 1910 లో పాండిచ్చేరికి రాక ముందు తన యోగస్థితిని 'ప్రాథమిక' లేక 'శిక్షణా స్థాయి' గా వర్ణించారు. అంటే అది అతిమానసిక యోగానికి ప్రాథమిక దశ అన్న మాట. "మనలో ఉన్న ఆ జగద్గురువు నా కప్పుడు సంపూర్తిగా నా పథ నిర్దేశనం చేశాడు. దాని సంపూర్ణ సిద్ధాంతమూ, ఈ యోగప్రక్రియకు సంబంధించి 10 అంగాలనూ నాకు తెలియజేశాడు ఈ పది సంవత్సరాలూ (1910-1920) అనుభవంలో దాన్ని నేను అభివృద్ధిపరచుకొనేటట్లు నన్ను తయారుచేస్తూ వచ్చాడు, అది ఇంకా పూర్తి కాలేదు".

"మనం పైపైకి అతిమానసస్థాయికి ఎదగలేకపోతే, విశ్వం అంతిమ రహస్యాన్ని తెలుసుకోలేం దాని వలన తలెత్తే సమస్య పరిష్కరించబడక అలాగే ఉండిపోతుంది."

"ఈ మార్పు జరగడం అంత తేలికైన విషయమేమీ కాదు. ఈ పదిహేను సంవత్సరాల తర్వాత నేను అతిమానసంలోని మూడు స్థాయిలలోని నిమ్నస్థితికి మాత్రమే ఇప్పుడు ఎదుగుతున్నాను., కింద జరిగే కార్యకలాపాలన్నింటినీ దానిలోనికి ఉద్ధరించే ప్రయత్నం చేస్తున్నాను. కాని ఈ సిద్ధి సంపూర్ణమైన తర్వాత, కచ్చితంగా భగవంతుడు నా ద్వారా ఇతరులకు తేలికగా అతిమానససిద్ధిని తక్కువ కృషికే తప్పక అందించగలడని దృఢంగా నమ్ముతున్నాను. అప్పుడు నా అసలైన పని మొదలవుతుంది. ఈ పనిలో సఫలతకు నేను అసహనంతో లేను. భగవంతుడు నిర్ధారించిన సమయంలో ఏమి జరగాలో అది జరుగుతుంది. నాకున్న అల్ప అహం బలంతో నిలకడ కోల్పోయి తొందరపాటుతో ఒక్కసారిగా రంగంలోకి దిగి పని మొదలుపెట్టాలనే ఉద్వేగపూరిత ప్రేరణ ఏమీ లేదు. ఒక వేళ నేను నా పనిలో

విఫలమైతే నేనేమీ నిరాశతో కుంగిపోను. ఇది నా పని కాదు, భగవంతునిది నేను ఏ ఇతర పిలుపునూ పట్టించుకోను, దైవం నన్ను కదిలించినప్పుడే నేను కదులుతాను."

"నాకు వందల వేల శిష్యులు అవసరం లేదు. తమ అప్రధానమైన అల్ప అహాన్ని పరిశుద్ధి చేసుకుని, దైవం పనిముట్లు గలిగే ఒక వందసంపూర్ణ మానవులను నేను పొందగలిగితే చాలు."

"అపరిపక్వ వ్యక్తి అపరిపక్వ వ్యక్తుల మధ్యలోకిపోతే అతడు ఏమి చేయగలడు?"

పైన ఉదహరించబడిన వాక్యాలు శ్రీఅరవిందులు పాండిచ్చేరి వచ్చినప్పుడు ఆయన తన దారి కోసం చీకటిలో వెతుకులాడ లేదనే విషయాన్ని సవిస్తరంగా తెలియజేస్తున్నాయి.; ఆయన మార్గం చాలా స్పష్టంగా ఆయన ముందుంది. 1910 తరువాత ఆయన యోగమంతటిని దైవం తన చేతిలోకి తీసేసుకున్నాడు, పది అంగాలతో సాధన మార్గం ఆయనకు విశదం చేయబడింది. మనస్సుకు పైన అతిమానసిక లోకం ఉన్నదనే సంగతి ఆ రోజులలోనే ఆయనకు రూఢిగా తెలుసు, 1920 సంవత్సరంలో ఆ చైతన్యపు నిమ్నస్థాయికి ఆరోహించడంలో ఆయన కృతకృత్యులయ్యారు; దానితో పాటుగా తన ప్రకృతిలోని ప్రతి కదలికనూ ఆ స్థాయికి ఉద్ధరించగలిగారు.

అంతేకాక కార్యనిర్వహణలో ఆయన అసహనంతో లేరు. ఆయన తలపెట్టిన కార్యాన్ని అజ్ఞానమయమైన మానవ పనిముట్లతో గాక, ఉన్నత చైతన్యంతో చేయాలని అనుకున్నారు. అతిమానసికశక్తి అవరోహించి పరిపూర్ణస్థితిలో స్థిరపడటం జరిగితే, అప్పుడు చాల తక్కువ ప్రయత్నంతో ఇతరులు లాభపడగలరని ఆయన గట్టిగా విశ్వసించారు.

అతిమానససిద్ధి కోసం తపస్సు జరుగుతుండగా, అదృష్టవశాత్తు, దైవం పంపించినట్టుగా, శ్రీమాత, శ్రీఅరవిందులతో కలిసి ఆ గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమంలో చాలా సన్నిహితంగా పనిచేశారు. తమ మార్గదర్శనానికి శిష్యులు శ్రీమాత చెంతకు పోవటం 1926 వ సంవత్సరం ప్రారంభం నాటికే మొదలయింది. అందులో ఆశ్రమంలో ఉండే మహిళా శిష్యులలో కొంతమంది — ముగ్గురు లేక నలుగురు శ్రీమాత చెంతకు ధ్యానానికి వెళ్లేవారు. 1926 ఆగష్టు నుంచి శ్రీమాత చెంతకు వెళ్ళే శిష్యులు అధికమవసాగారు. అది ఏ విధంగా ఉందంటే, శ్రీఅరవిందులు తనలో తాను ఏకాంతంలో ఉంటుండగా, శ్రీమాత ఒక్కసారిగా ముందుకు వచ్చి

సాధకుల అంతరంగ సాధనకు, మార్గదర్శకాన్నీ, వారి బాహ్య ఆశ్రమ జీవిత యాజమాన్య మహాకార్యాన్నీ తన భుజస్కంధాల మీదికి తీసుకున్నారు. ధ్యానాలు ఇంకా ఎక్కువ ఏకాగ్రత, తీవ్రతగల స్థాయికి చేరుకొన్నాయి. శ్రీఅరవిందులు సాయంత్రం వచ్చి, శిష్యులతో కూర్చునే సమయం అధికాధికంగా ఆలస్యం అవుతూ వచ్చింది. ఈ మార్పులను ఏ ఒక్కరూ అసహజంగా భావించకపోవడం ఆశ్చర్యం కదూ! శ్రీమాతారవిందుల ఆ బృహత్తర కార్యక్రమంలో శిష్యుల పాత్రకు ఏ ప్రాముఖ్యతా లేదు, అయినప్పటికీ ఆశ్రమంలోని అంతరంగ, బాహ్య వాతావరణంలోని మార్పులకు వారు సాక్షులయ్యారు.

1926 ఆగష్టుకు ముందూ, ఆ తర్వాతా సాయంత్రం పూట జరిగే సంభాషణల తీరును బట్టి ఉన్నతోన్నతమైన అతిమనస్సుకూ మనస్సుకూ రెండింటికీ అనుసంధానం ఉండాలనే దాని ప్రాముఖ్యత నొక్కి చెప్పబడిందనేది చాలా మటుకు స్పష్టమయిన విషయం. శ్రీఅరవిందులు ఇలా అనుసంధానంగా ఉన్నదాన్ని అధిమనస్సని అన్నారు. 1920 లో బరీన్‌కు వ్రాసిన తరువాతి 6 సంవత్సరాల కాలంలో ఆయన ఒక ఉన్నత చైతన్యంలోనికి ఆరోహించడం మాత్రమే కాకుండా, దానిని ప్రకృతి లోనికి అవరోహింప చేయడంలోనూ చాలా ముందుకు వెళ్ళిపోయారనే విషయం స్పష్టంగా తెలుస్తూనే ఉంది. 1926 నవంబరు నెల ప్రారంభంలో చాలామార్లు సాయంత్రం సంభాషణలు, దైవచైతన్యం అవతరణ సంభావ్యతా, అవతరణా విధానం వైపుకు సాగిపోయేవి ఈ సాయంత్రం సమావేశాలలోని మాటల కారణంగా చాలామంది శిష్యులకు అటువంటి అవతరణ దగ్గర పడబోతున్నదనే భావన ఉదయించింది. దేవుళ్ళ అవరోహణ జరగవచ్చని అనుకోవటమూ జరిగింది. శ్రీఅరవిందుల దివ్యజీవన గ్రంథంలో అధిమనస్సు భూమిక అధిమనః చైతన్యం, అధిమనస్సు భూమికలోని భగవంతుళ్ళ గురించి చాలా స్పష్టంగా వివరించారు. ఇక్కడ నేను ఆ అధ్యాయనం నుంచే కొన్ని పంక్తులను ఉదహరింస్తాను, ఇది 1926 నవంబరు 24 న జరిగిన అవతరణను అర్థం చేసుకోవడానికి ఉపయుక్తమవుతుంది.

“మనం మహాసత్యం యొక్క శక్తులను అనేక అధిష్టాన దేవతలుగా తలంచితే, అధిమనస్సు అనేక లక్షల అధిష్టాన దేవతలను కార్యరంగంలోకి దించుతుంది, ప్రతిదీ తనదైన లోకాన్ని సృష్టించుకోగలిగిన శక్తిని కలిగి ఉంటుంది, ప్రతి లోకమూ, ఇతర లోకాలతో సత్ సంబంధాలనూ, సందేశాలను ఇచ్చిపుచ్చుకోవటాన్నీ, పరస్పర

అన్యోన్య సంబంధాలనూ నెరపగలదు. వేదం వివిధ దేవుళ్ళ ప్రకృతి యొక్క వ్యవస్థీకరణలను పేర్కొంది: అవన్నీ ఒకే సత్ పదార్థమనీ, ఋషులు వాటికి అనేక పేర్లను పెట్టారనీ చెప్పబడింది; అయినప్పటికీ ప్రతి దేవుడూ స్వయంగా ఆ సత్పదార్థమే అతడు అన్నట్లుగా, ఇతర దేవుళ్ళందరూ కలిసినవాడే అతడన్నట్లు లేకా వారందరినీ అతడు తనలోనే కలిగి ఉన్నట్లుగా పూజించబడ్డాడు; అయినప్పటికీ తిరిగి ప్రతి దివ్యమూర్తీ మిగతా సహచర మూర్తులందరితో ఒక్కొక్కప్పుడు కలిసి, ఒక్కొక్కప్పుడు విడిగా, ఒక్కొక్కప్పుడు అదే సత్పదార్థపు ఇతర అధిష్ఠాన దేవతలందరికీ పూర్తి వ్యతిరేకంగా పైకి కన్పించేటట్లు వ్యవహరిస్తున్నట్లుగా చెప్పబడింది. అతిమనస్సులో ఇదంతా ఒకే సత్పదార్థపు సామరస్య ఖేలనగా ఏకం చేయబడి ఉంటుంది; అధిమనస్సులో ఈ మూడు స్థాయిలు దేనికదేగా విడిపోయికర్మ కొనసాగించేవిగా అవుతాయి. కర్మకూ, తనదైన ప్రధాన అభివృద్ధి సూత్రానికీ, పర్యవసానాలకూ ప్రాతిపదికగా అవుతుంది. అయినప్పటికీ ప్రతిదీ ఇతరమైన వాటితో అధికతరమైన సామరస్యతాపూర్వక సంకీర్ణ మిశ్రమంగా కలిసిపోగల శక్తిని కలిగి ఉంటుంది. ఏకైక సత్పదార్థంలో ఇదంతా ఏ విధంగా ఉంటున్నదో అదే విధంగా మహాచైతన్యంతోనూ, మహాక్రియాశక్తితోనూ ఉంటుంది. ఆ ఒకే ఒక మహాచైతన్యం అనేక స్వతంత్ర, జ్ఞానరూపాలలో విడిపోతుంది; ప్రతిదీ తాను సాక్షాత్కరించుకోవలసిన తనదైన సత్యసూత్రాన్ని అనుసరిస్తుంది. ఒకే ఒకటయిన ఆ సంపూర్ణ, బహుముఖాలతో కూడిన పరమ సత్య-భావన తన బహుపార్శ్వాల లోనికి చీలిపోతుంది; తనను తాను వాస్తవం చేసుకోగల శక్తితో మహాభావన క్రియాశక్తిగా మారిపోతుంది. ఒకే ఒక్కటయినటువంటి మహా చైతన్య-క్రియాశక్తి తన లక్షల శక్తులుగా విడుదలవుతుంది. ప్రతి శక్తీ తనకు తాను సఫలత పొందే హక్కును కలిగి ఉండటం లేదా అవసరమనుకుంటే, నాయకత్వం ఆధిపత్యాన్ని ఆపాదించుకుని, అవసరమైతే తన ఇతర శక్తులను ఉపయోగించుకుంటుంది. అదే విధంగా సత్ యొక్క దివ్యానందం అనేక విధాలైన ఆనందాలుగా విసృజమై, ప్రతిదీ తనలో స్వతంత్ర సంపూర్ణతనూ లేక పరమోత్కృష్ట సార్వభౌమత్వాన్నీ కలిగి ఉంటుంది. ఆ విధంగా అధిమనస్సు ఆ ఒకే ఒక్క సత్-చిత్-ఆనందానికి అనంత సంభావ్యతలను జాలువార్చే లక్షణాన్ని సృష్టికీ, దాని విధివిధానాలకూ, దాని కాలగతికీ, దాని పర్యవసానాలకూ కారణమవుతూ అంతులేని వైవిధ్యాల క్రీడగా మారిపోయే అనేక లోకాలనూ లేదా అన్నింటినీ కలిపి

ఒకే లోకంగానూ అభివృద్ధి చేయగలందులకై ఇస్తుంది.”.[1]

“(అధిమనస్సులో) ప్రతి దేవుడూ దేవుళ్ళందరి గురించీ సృష్టిలో వారి స్థానం గురించిన జ్ఞానాన్ని కలిగి ఉంటాడు; ప్రతి మహాభావం ఇతర భావాలన్నింటినీ, జీవించేందుకు వాటికి గల హక్కునూ అంగీకరిస్తుంది. ప్రతి మహాక్రియాశక్తీ ఇతర శక్తులన్నింటికీ, వాటి సత్యానికీ, పర్యవసానాలకూ ఒక స్థానాన్ని అనుమతిస్తుంది. విడిగా సఫలత నొందిన ఏ ఉపాధి ఆనందం లేక ప్రత్యేకత అనుభవం, ఇత ఉపాధుల ఆనందానుభవాన్నీ లేదా ఇతర అనుభవాలనూ వ్యతిరేకించటం లేదా తోసిరాజనటం చేయదు. అధిమనస్సు విశ్వగతమైన మహాసత్య న్యాయసూత్రాలతో, బృహత్తరమైన, అనంతమైన సర్వతోముఖ సమదృష్టిని కలిగి ఉంటుంది. దాని శక్తి అన్నింటి క్రియాశీలతే కాకుండా భిన్న మైన క్రియాశీలతతోనూ ఉంటుంది.”[2]

వ్యక్తిగతమైన అనుభవాల ద్వారా పొందిన సంకేతాలు లేక అక్కడ జరుగుతున్న పరిణామాలతో చాలామంది శిష్యుల మనస్సులలో ఉన్నత దివ్య చైతన్యం అవతరించబోతున్నదనే భావం పెరిగిపోయింది. ఆశ్రమంలోని బాహ్యవ్యవస్థలో పెద్ద పెద్ద మార్పులు జరగబోతున్నవనే అనుభూతిని చాలామంది పొందారు. సాధారణంగా సాయంత్రం 4 గంటల 30 నిమిషాల తర్వాత వచ్చి బయట కూర్చునే సమయానికి బదులుగా, శ్రీఅరవిందులు 6 లేక 8 గంటలకు రావటం జరిగేది. ఒక రోజు రికార్డు స్థాయిలో అధికాధికంగా తెల్లవారుఝామున 2 గంటలకు రావటం జరిగింది! ఆయన సమస్త గొప్ప శక్తులనూ యోగం ఉన్నత దివ్యచైతన్యాన్ని కిందికి తీసుకురావటమనే బృహత్తర కార్యక్రమం తీసుకుందనే విషయం సుస్పష్టం. అంతేకాక ఆయన ఆ పనిలో ఒక్క క్షణమైనా వదలుకోవటానికిగాని లేక మరొక విషయానికి మరలటానికిగాని ఇష్టపడలేదు. బాహ్యంలో శిష్యులతో సంబంధం పెట్టుకుని గడిపే సమయం ఉపయోగకరమైనదైనప్పటికీ, అంతరంగంలో నిర్వర్తించవలసినదానికి కేటాయించవలసిన సమయం చాలా ఎక్కువ కావలసినదవటం మూలంగా అది ఎక్కువెక్కువ కష్టసాధ్యమౌతున్నది. ఆయన బృహత్తర కార్యక్రమం గురించి ఏమీ

---

[1] Sri Aurobindo, *The Life Divine*, Book One (pondicherry: Sri Aurobindo Ashram, 1970), pp. 280-81)

[2] Ibid.

తెలియనివారికి దైవకార్యంలో పరిపూర్ణతకు పడే తపనలో ఆయన ఎంత ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో ఉన్నదీ ఏమాత్రం అర్థం చేసుకోలేరు. చెప్పాలంటే, బయట ఉన్నవాళ్ళు, అప్పటికే, ఆయన బృహత్తర కార్యక్రమంలో ఏదైనా 'ప్రజోపయోగకరమైనది' జరుగుతోందా అనే సందేహాన్ని వెలిబుచ్చారు. ఆయన ఆధ్యాత్మిక కార్యక్రమం మీద గొప్పగా ఆశలు పెట్టుకున్నవారు, నిశ్చయంగా ఆయనను అభిమానించేవారు నిరాశచెందడం మొదలుపెట్టారు. కొంతమంది వారి అజ్ఞానంలో తెలివితక్కువ ఆలోచనలతో కూడిన నమ్మకాలతో శ్రీఅరవిందులు నిరపేక్ష, పరబ్రహ్మం అన్వేషణలో శూన్యప్రాంతాలలో దారితప్పి ఉంటారని లేదా అనంతుడి అంతుపట్టని నిగూఢమైన చుట్టలలో చిక్కుకుపోయి ఉంటారని శ్రీఅరవిందులు భూమి మీద అనుకొన్నారు. పట్టు కోల్పాయారనీ, చాలా ప్రబలమైన, దారుణమైన బాధలనుభవిస్తున్న మానవజాతి సమస్యలను పట్టించుకోని లేక వినిపించుకోని పరిస్థితిలో ఉన్నారని భావించారు.అలా కాకపోయిట్లయితే, ఎంతో బాధలననుభవిస్తున్న మానవజాతిని ఆయన దివ్యోపశమనంతో రక్షించడానికి ఎందుకు ఆతృతపడరు? ఇప్పటి కంటె ఆ దైవసహాయం అవసరం ఇంకెప్పుడుంటుంది?

కాని పైకి పరస్పర వైరుధ్యాలుగా కనిపిస్తున్నప్పటికీ ఎవరైతే ఆయన సాన్నిహిత్యంలో నివసిస్తున్న అదృష్టవంతులకు మాత్రం ఆయన తీసుకువస్తున్న మహోన్నత శక్తి వాస్తవమైన ఫలితాల నివ్వటంలో సమర్థవంతమైనదని మాత్రమేగాక ఫలితాల నిస్తున్నదనే విషయం బాగా తెలుసు. మహోన్నత మహాశక్తితో ఆయన అనుసంధానం, తాదాత్మ్యత ఎంత సంపూర్ణంగా ఉన్నదంటే ఆయన మిగతావారికి, వారు దగ్గర ఉన్నా లేక దూరాన ఉన్నా దానితో సంపర్కాన్ని కలిగించగలిగారు. ఆయన సహాయంతో చాలా మటుకు రోజూ వ్యక్తుల భౌతిక వివిధ రుగ్మతల నివారణ అయిన ఉదాహరణలున్నాయి. నిరపేక్ష బ్రహ్మంలో దారి తప్పకపోగా, పైపెచ్చు ఆయనకు ప్రతి రోజూ తన మార్గం ఇంకా ఇంకా ఎక్కువగా స్పష్టమౌతున్నది, అంతేగాక భువిపై పరిణామ గతి యొక్క సహజ పతాకస్థాయి అనదగిన అవతరణం తప్పనిసరిగా జరిగితీరుతుందనే అనుభూతి ఆయనకు అధికాధికమౌతున్నది. మానవజాతి మీద ప్రగాఢమైన సానుభూతి, జాలి, శ్రీఅరవిందు ప్రభువుల కంటె ఉన్నవారు ఈ భూమి మీద మరెవ్వరూ లేరని ఆయన శిష్యులకు తెలుసు. నిశ్శబ్దంగా, నిర్దుష్టమైన సహాయం ఆయన నుంచి మానవజాతికి

అందుతున్నదనే విషయం అప్పుడప్పుడు వారికి అస్పష్టంగా దర్శనీయమైంది. "సావిత్రి"లో అశ్వపతి గురించి ఆయన వ్రాసిన "ఆయన ఆత్మనిశ్చలత, సమస్యలతో సతమతమవుతూ పెనుగులాడుతున్న ప్రపంచానికి సహాయం చేసింది" అనే వాక్యం చదివినవారికి అది ఆయన స్వీయజీవన సత్యమనే విషయం తేటతెల్లం. అసలు 'ప్రయోజనకరం' అని జనులు అనేది ఏమిటి? సమస్యలు పరిష్కరించేది అని చెప్పుకొంటూ, పరిష్కరించామనే సంతృప్తినిచ్చే అనిపించే, ఆత్మతృప్తినిచ్చే అసత్య భావనను కలిగిస్తూ, సమస్యలను అపరిష్కృతంగా గాని లేదా సగమే పరిష్కరించిగాని వదలివేసేదాన్నా ప్రయోజనకరమైనది అనేది? వాస్తవానికి అటువంటి భ్రాంతిపూర్వకమైన సంతృప్తులు ఎప్పటికీ ఆయనను మోసగించలేనంత గట్టి పట్టు శ్రీఅరవిందులకు భూమి మీద ఉన్నది. ఆయనకు కర్మసుకౌశలం (పనిలో నైపుణ్యం) అనేది ఉన్నతమైన మహాసత్య-చైతన్యం నుంచి కర్మ చేయడంలోనే ఉంది. భౌతికం లోనికీ, అత్యంత స్థూలపదార్థ చైతన్యంలోనికీ మహోన్నత దివ్యచైతన్యం అవతరించకుండా ఆయన బాహ్యంలో తన పనిని మొదలుపెట్టదల్చుకోలేదు. కేవలం, అప్పుడే, కొత్త జీవనం, దైవాన్ని సమగ్రంగా అభివ్యక్తం చేయగలిగిన జీవనం రూపుదిద్దుకోగలదు. ఆయన మొదలుపెట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమ సఫలతలో మానవజాతి సమస్య లన్నింటి యొక్క పరిష్కారం ఉంది.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడచిపోతున్నాయి. కాని శ్రీఅరవిందులు తన పని మొదలుపెట్టడానికి ఏమాత్రం తొందరపడటం లేదు. ఆయన సమయాన్నంతా ఆ మహోన్నత మహాశక్తి అవరోహణ సాధ్యమయేందుకు సంసిద్ధం చేయడానికి వినియోగిస్తున్నారు. ఈ ప్రయత్నంలో అజ్ఞానశక్తుల అవరోధం సహజంగానే అమితం. ఒక రోజు సాయంత్రం పూట సంభాషణల్లో భౌతిక కణాలను దివ్యప్రకాశానికి ఉన్మీలనం చేసే మహాద్భుత కార్యక్రమంలో తలమునకలై తీరిక లేకుండా ఉన్నాననీ, దానికి అచేతన అవరోధం చాలా దుస్సాధ్యమైనదిగా ఉన్నదని చెప్పారు. ఇంతటి హెర్క్యులియన్ శ్రమ తన కోసం కాక మానవజాతి కోసమేననే విషయమూ, ఎవరికైనా తెలిస్తే, తరువాత ఆయన సావిత్రిని గురించి "ప్రపంచం అజ్ఞానంలో ఉంటున్నది, అటువంటి ప్రపంచం కోసం ఆమె పోరాడుతున్నది" అని వ్రాసిన మాటలు ఆయన విషయంలో సరిగ్గా సరిపోతాయని గ్రహిస్తారు. ఆ కారణంగా, సహజంగానే శ్రీఅరవిందులు, శ్రీమాతల అనుగ్రహం వలన అవతరణ సామీప్యతను

సంవేదిస్తున్న శిష్యుల మనస్సులు సంపూర్ణమైన ఆశాభావంతో, ఉత్సాహభరితమైన ఏకాగ్రతతో నిండిపోయి ఉండి ఉంటాయి.

1926 నవంబరు ప్రారంభం నుండీ ఉన్నతతర దివ్యశక్తి ఒత్తిడి భరించలేనంత గావడం మొదలయింది. ఆఖరుకు ఎన్నో సుదీర్ఘ సంవత్సరాలుగా శ్రీమాత ఎదురుచూస్తున్న, ఆ మహత్తర దినం రానే వచ్చింది, అది నవంబరు 24. చాలా వరకు సూర్యాస్తమయమైంది, ప్రతివారూ తమ పనులలో మునిగిపోయారు — కొంతమంది సముద్రం వైపుకు వాహ్యాళికి వెళ్ళారు — ఆ సమయంలో శ్రీమాత శిష్యులందరినీ సాధారణంగా ధ్యానం జరిగే వరండాలో సమావేశమవ్వమని కబురు పంపించారు. ఆ వార్త అందరికీ చేరటానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఆరుగంటల ప్రాంతానికి శిష్యులలో చాలామంది వచ్చి చేరారు. బాగా చీకటి పడుతోంది. వరండాలో శ్రీఅరవిందుల తలుపు వద్ద నున్న గోడ మీద సరిగా ఆయన కుర్చీ వెనుకగా, మూడు చైనా డ్రాగన్‌లతో (భయం గొలిపే నోటితో పెద్ద బల్లి లేక పాము) నున్న బంగారు లేసు కలిగిన సిల్కు తెర వ్రేలాడదీయబడి ఉంది. ఆ మూడు డ్రాగన్‌లు ఏవిధంగా ఉన్నవంటే ఒకదాని తోక మరొకదాని నోటిలో ఉంది, ఆ విధంగా మూడూ తెరమీద ఒక చివరి నుంచి మరొక చివరి వరకూ పరుచుకుని ఉన్నాయి. తరువాత మాకు తెలిసినదేమంటే చైనాలో ఒక సామెత ఉంది. అది, ఆ మూడు డ్రాగన్లూ కలిసినప్పుడు మహాసత్యం తనంత తాను భూమి మీద అభివ్యక్తమౌతుంది (భూమికీ, మనస్సీమలకూ, ఆకాశానికీ సంబంధించిన డ్రాగన్లు). ఆ రోజు నవంబరు 24 న మహాసత్యం అవతరిస్తున్న తరుణంలో ఈ తెరను వ్రేలాడదీయటం ప్రాధాన్యత సంతరించుకొంది.

శిష్యులందరూ అక్కడ చేరిన తర్వాత అక్కడి వాతావరణంలో గంభీరమైన నిశ్శబ్దం ఆవరించుకుని ఉన్నది. చాలామంది పెద్ద వరదలాగా మహాప్రకాశం పైనుంచి క్రిందికి దూసుకురావటం చూశారు. అక్కడ ఉన్న ప్రతివారూ వారి తలమీద ఒక విధమైన ఒత్తిడి అనుభూతిని పొందారు. అక్కడి పరిసర వాతావరణం మొత్తం ఒక విధమైన విద్యుదావేశంతో దట్టించబడింది. ఆ నిశ్శబ్దంలో, ఆశావహపూరితమైన ఏకాగ్రతా, ఆకాంక్షలతో నిండిన వాతావరణంలో, ఆ విద్యుదావేశం దట్టించబడిన వాతావరణంలో, సాధారణమైనటువంటిదే, కాని ఈ రోజు ఒక విధంగా అసాధారణంగా, ప్రవేశద్వారం వెనుక నుంచి 'టిక్' అనే ధ్వని వినబడింది. ఆశాభావంతో ఎదురుచూస్తున్న

వారందరి ఉద్వేగం కట్టలు త్రెంచుకుంది. సగం తెరువబడిన తలుపు మధ్య నుంచి శ్రీఅరవిందులు, శ్రీమాత కనిపించారు. శ్రీమాత తన కనుసైగతో శ్రీఅరవిందులను మొదట బయటకు వెళ్ళమనగా, అటువంటిదే అయిన కనుసైగతో శ్రీఅరవిందులు ఆమెనే ముందు వెళ్ళమని సూచించారు. నెమ్మదిగా, హుందాగా అడుగిడుతూ శ్రీమాత ముందు బయటికి వచ్చారు. ఆమె వెనుక రాచఠీవితో శ్రీఅరవిందులు వచ్చారు. ఈ రోజు మామూలుగా శ్రీఅరవిందుల ముందు ఉండే చిన్న మేజాబల్ల తీసివేయబడింది. ఆయన కుడి వైపున చిన్న స్టూలు మీద శ్రీమాత ఆసీనులయ్యారు.

పూర్తి నిశ్శబ్దం, సజీవమైన నిశ్శబ్దం — కేవలం సజీవమే కాదు, చైతన్యంతో పొంగి పొరలేటటువంటిది. ధ్యానం 45 నిమిషాలు జరిగింది. తరువాత ఒకరి తరువాత ఒకరు శ్రీమాతకు ప్రణమిల్లారు.

ఆమె, శ్రీఅరవిందులు అందరికీ ఆశీస్సులందజేశారు. ఏ శిష్యుడు శ్రీమాతకు ప్రణామం చేస్తున్నా అప్పుడు శ్రీఅరవిందుల కుడిచేయి శ్రీమాత చేయి పైగా ముందుకు వచ్చి శ్రీమాత ద్వారా ఆశీస్సులందజేస్తున్నట్లుగా అనిపించింది. ఆశీస్సుల తర్వాత, ఆ నిశ్శబ్దంలో చాలా తక్కువ సమయం ధ్యానం జరిగింది.

ఆ నిశ్శబ్ద ధ్యాన విరామ సమయంలోనూ, ఆశీస్సులందజేసే సమయంలోనూ చాలామందికి విశిష్టమైన అనుభవాలు కలిగాయి. అంతా అయిపోయిన తర్వాత వారందరూ ఒక దివ్యమైన స్వప్నం నుంచి మేల్కాంచిన అనుభూతి పొందారు. అప్పుడు వారికి ఆ క్షణాల వైభవం, కవన మాధుర్యం, సంపూర్ణ రమణీయతానుభూతి కలిగింది. అది ఏదో కొద్దిమంది శిష్యులు భూమి మీద ఒక మూల తమ పరమ ప్రభువు, శ్రీమాతల ఆశీస్సులు పొందటమే కాదు; ఆ సందర్భం ప్రాధాన్యత దానిని ఎంతో మించి ఉంది. ఉన్నత దివ్య చైతన్యం భూమి మీద అవతరించిందనేది యధార్థం. ఆ గాఢ నిశ్శబ్దంలో, ఒక వటవృక్షపు మొలక, పైకి పొటమరించుకుని వచ్చినట్లు మహత్తరమైన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం మొదలైంది. ఆ అద్భుత క్షణాలు వాటి ప్రాముఖ్యతను, నిశ్శబ్ద దివ్యక్రియాశీలతను, దాని అలౌకిక ఠీవిలో, వైభవంలో దాని ప్రతి చిన్నచేత లో తొణికిసలాడే సంపూర్ణ రమణీయతలో అందరికీ అందజేసింది. అందరిపైన ప్రగాఢంగా పడిన ఆ దివ్యత్వపు ముద్ర ప్రతివారికీ అమూల్యమైన పెన్నిధి.

శ్రీఅరవిందులు, శ్రీమాత లోపలికి వెళ్ళారు. వెంటనే దత్త (ఒక శిష్యురాలు)

అంతఃస్ఫూర్తి నొందింది. ఆ నిశ్శబ్దంలో ఆమె అన్నది, "ఈ రోజు పరమేశ్వరుడు భౌతికంలోకి అవతరించాడు".

శ్రీఅరవిందుల, శ్రీమాత జన్మదినాలతో సమానమైన ప్రాముఖ్యత నవంబరు 24 వ తేదీకి ఇవ్వటం అనేది సముచితమే. ఎందువల్లనంటే, ఆ రోజు ఉన్నతమగు దివ్యశక్తి వారి విధాయక కార్యవిజయానికి ప్రతీకగా అవతరించడం జరిగింది. అధిమనస్సులోని దివ్యానంద చైతన్యం — మానవశరీరంలో అవతారమూర్తిగా శ్రీకృష్ణుడిగా అవతరించింది — ఆ రోజు భౌతికంలోకి అవతరించి పదార్థంలో అతిమనస్సు అవతరణకు మార్గం సుగమం చేసింది.

శ్రీఅరవిందులు తర్వాత చాలా సందర్భాలలో ఈ అవతరణను గురించి వ్రాయడం జరిగింది. 1935 అక్టోబరులో ఆయన ఈ విధంగా వ్రాశారు, "అది (24 నవంబరు 1926) శ్రీకృష్ణుడు భౌతికంలోకి అవతరించిన రోజు".

"శ్రీకృష్ణుడు అతిమానస ప్రకాశం కాదు. శ్రీకృష్ణుడు అవతరించడమంటే అధిమనస్సు అధిదేవత అవతరణ. వాస్తవానికి అతిమనస్సును అది తీసుకురాలేకపోయినా, అతిమనస్సు, ఆనందాలు అవతరించడానికి ఆ అవతరణ సన్నద్ధం చేస్తుంది."

24 నవంబరు 1926 న ఉన్న శిష్యుల పేర్లు:

1) బిజయ్ కుమార్ నాగ్ 2) నళినీకాంత గుప్త 3) కె. అమృత 4) మోని (సురేష్ చక్రవర్తి 5) పవిత్ర (ఫిలిప్స్ బార్బియర్ సెయింట్-హిల్లేర్) 6) బరీంద్ర కుమార్ ఘోష్ 7) దత్త (మిస్, హడ్సన్) 8) కె. రాజంగం 9) సత్యేన్ 10) ఎ. బి. పురాణి 11) లీలావతి (పురాణీ భార్య) 12) పూనమ్ చంద్ 13) చంపాబెన్ (పూనమ్ చంద్ భార్య) 14) రజనీకాంత్ పాలిత్ 15) డా. ఉపేంద్రనాథ్ బెనర్జీ 16) చంపక్‌లాల్ 17) కనయాలాల్ గంగూలీ 18) ఖితిష్ చంద్రదత్ 19) వి. చంద్రశేఖరం 22) రతి పాలిత్ 23) రంభాయి పటేల్ 24) నాని బాల (జయదేవి)

(The Life of Sri Aurobindo by A. B. Purani, 4th ed., pp. 210-17)

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

శ్రీఅరవిందాశ్రమ ఆదర్శం, లక్ష్యం

సాధారణ వ్యవస్థీకృత ఇతర సన్యాసాశ్రమములవలె కాక, ఒక విశిష్ట జీవన విధానంలో అత్యున్నత ఆధ్యాత్మిక చైతన్య సాధనా కేంద్రంగా, క్షేత్రంగా ఈ ఆశ్రమం నిర్మించబడింది.

*

కేవలం ముక్తికోసం కాక ఆధ్యాత్మిక జీవన కేంద్రస్థాపన నా లక్ష్యం. ఉన్నత చైతన్యాన్ని భువికి తీసుకుని వచ్చి దాని శక్తితో దివ్యజీనవాన్నితీర్చిదిద్దడం ఈ కేంద్రం యొక్క ముఖ్యోద్దేశం. ఈ లక్ష్యంతో నేను జనజీవితం నుంచి తొలగి ఈ ఆశ్రమాన్ని పుదుచ్చేరిలో స్థాపించాను. (ఈ లక్ష్యం కొరకు పాటుపడేవారి కోసం ఉన్న దీన్ని ఆశ్రమం అన్న ఉచితమైన పదంతో పిలవటం జరిగింది కాని ఇది సన్యాసులుండే ఆశ్రమం కాదు.)

శ్రీఅరవిందులు.

శ్రీఅరవిందులు చెప్పినదాన్ని సమ్మతించింది మా అనుభవం. అది బుద్ధి కావలగా సాధారణ వివేకం కంటె గొప్పదైన ఒక చైతన్యం కలదు. విషయాల లోతులలో మన ఇచ్ఛకు మించిన బలమైన మరొక ఇచ్ఛ కలదు.

మన ప్రయత్నమంతా ఈ చైతన్యం, ఇచ్ఛ మన జీవితాలను, మన దైనందిన కార్యకలాపాలను వ్యవస్థీకరించి పాలించాలని.

*

ప్రకృతిలో ఆరోహణా దిశగా పరిణామక్రమం జరుగుతోంది. అది రాయి నుంచి మొక్క, మొక్క నుంచి జంతువు, జంతువు నుంచి మనిషిగా పరిణమించింది. ఈ తరుణంలో మనిషి దశే పరిణామ క్రమంలో చిట్టచివరి దశ అని నమ్ముతూ, భూమి మీద తనే ఉన్నతమైన జీవి అనే భావనతో అతడు పొరపడుతున్నాడు. అతని భౌతిక ప్రకృతిలో ఇప్పటికీ అతను పూర్తిగా జంతువే. ఆలోచించి మాట్లాడే జంతువు. అలవాట్లలోనూ అంతఃకరణలోనూ నిస్సందేహంగా జంతువే. ఇటువంటి అసంపూర్ణ ఫలితంతో ప్రకృతి సంతృప్తి చెందదు. బాహ్యారూపంలో మనిషిగా ఉంటూ మానసిక భూమికను, దాని అజ్ఞానాన్ని దాటి దానికి ఆవలగా నున్న చైతన్యస్థాయికి ఎదిగే జీవిని తయారుచేయుటకు ప్రకృతి కృషి చేస్తోంది.

ఈ సత్యాన్ని మనుషులకు తెలుపుటకు శ్రీఅరవిందులు అవతరించారు. మానసిక చైతన్యంలో ఉన్న ఈ మనిషి కేవలం రూపాంతరం చెందుతున్న జీవి మాత్రమే. కాని క్రొత్త చైతన్యాన్ని, సత్య-చైతన్యాన్ని పరిపూర్ణ సమతలో గల జీవితాన్ని, సౌందర్యం, సంతోషం, పూర్తి యెరుకను పొందటం ఈ జీవికి సాధ్యమే. ఈ క్రొత్త చైతన్యాన్ని 'అతిమానసం' అని శ్రీఅరవిందులు అన్నారు. దీన్ని తనలో స్థిరపరచుకొనుటకు దీనిని తన దరి చేరిన వారందరూ తెలుసుకొనుటకు వారికి సహకరించేందుకు తన కాలాన్నంతా వెచ్చించారు.

*

ప్రశ్న: స్వీట్ మదర్, శ్రీఅరవిందుల ఆశ్రమమంటే ఏంటి? అని మమ్మల్ని ఎవరైనా అడిగితే, తక్కువ మాటలతో, సముచితంగా వారికి ఏమని తెలియచేయాలి?

జవాబు: రాబోయే రేపటి క్రొత్త ప్రపంచానికి ఈ ఆశ్రమం పొత్తిళ్ళలాంటిదని చెప్పాలి. మరింతగా ప్రశ్నిస్తే, శ్రీఅరవిందుల గ్రంథాలని చదవమని, వారి బోధనలను అధ్యయనం చేయమని చెప్పాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: యన్. త్రివేణి

17 నవంబరు 1973: శ్రీమాత మహాసమాధి

శ్రీమాత తనను గురించి తానే

ఈ భూమి పుట్టినదాదిగా ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు దివ్యచైతన్యదీప్తి అభివ్యక్తమయ్యే అవకాశం వుందో అక్కడ నేనున్నాను.

*

ఇప్పుడు మీతో మాట్లాడుతున్న దెవరో, ఆమె ఆ దైవం యొక్క విశ్వాసపాత్రమైన సేవకురాలు. భూమి పుట్టినది మొదలు నిరంతరం తను ఒక విశ్వాసపాత్రమైన దైవ సేవకురాలిలా తన యజమాని పేరుతో మాట్లాడినది.

భూమి, మనుష్యులు ఎంత కాలం వుంటారో అంత కాలం తను దైవవాక్కును

బోధించడానికి ఒక శరీరంలో తప్పక వుంటుంది.

*

ఓ నా ప్రభూ! "పదార్థంలో మునిగిపో. దానితో విడదీయ రానంతగా పూర్తిగా కలిసిపో. అక్కడ నేను కూడా అభివ్యక్తమవుతాను," అని నువ్వు నాకు చెప్పేవు.

నీ సంకల్పమే నెరవేరింది. కానీ పదార్థం నీ కానుకను నిర్లక్ష్యం చేసింది. అస్పష్టమైన, తప్పుడు కార్యకలాపాలలో, సంబంధాలలో నిన్ను తెలుసుకోవాలని దృఢంగా ప్రయత్నిస్తూ వుంటుంది. అయితే దాని వలన కోరినది పొందాననే సంతృప్తినది ఎన్నటికీ పొందలేదు.

అయినప్పటికీ విజాయాన్ననుగ్రహిస్తానని నువ్వు మాటిచ్చావు.

అవతారమనుటకు గల అవకాశాన్ని నమ్మడమా, నమ్మకపోవడమా నమ్మినా, నమ్మకపోయినా నగ్న వాస్తవంలో బేధాన్ని కలిగించ లేదు. భగవంతుడు తను అభివ్యక్తం కావాడానికి మానవ శరీరాన్ని ఎంచుకుంటే మానవ ఆలోచన, అనుమతి లేదా నిరాకరణ లాంటివేవీ ఆ దైవనిర్ణయాన్ని ఏమాత్రం అడ్డుకోలేవు. దైవమే మానవశరీరంలో పుడితే మనిషి నిరాకరణ ఆ యధార్థాన్ని ఎంతమాత్రం యధార్థం కాకుండా ఆపలేదు. అందుచేత అందులో ఆశ్చర్యపడడానికేముంది. ఏ ప్రాధాన్యతలకీ పూర్వ నిర్దిష్ట అభిప్రాయాలకీ లోబడని ఒక పరిపూర్ణమైన ప్రశాంతత, నిశ్చలనీరవతలోనే చేతన సత్యాన్ని గ్రహించగలుగతుంది.

*

ప్రశ్న: తల్లీ! నీ నూతన శరీరంలో నిన్ను చూడాలని నా కెంతో కోరికగా వుంది. అంతవరకు నువ్వు నాకు ప్రసాదించుదానిని నేను స్వీకరించగలిగేటట్లు, జీర్ణించుకునేటట్లు అనుగ్రహించు.

శ్రీమాత: నువ్వంటున్న దాని కర్థం నా నూతన రూపం లేదా రూపాంతరం చెందిన నా శరీరం అనుకుంటున్నాను. నేను సంపూర్ణంగా, ఏమీ కోల్పోకుండా ప్రవేశించగలిగే, కనీసం సాక్షికంగానైనా నా ప్రస్తుత చైతన్యంతో ప్రవేశించగలిగే, ఒక సంపూర్ణ, జీవదేహంలో ఎవరైనా తయారుచేయగలరేమో నాకు తెలియదు. ఎందుకనంటే నూతన శరీరానికది కావాలి. ఇది బహుశా సాపేక్షికంగా త్వరితమైన విధానం అవగలుగుతుంది. అందుచేత సంపూర్ణమైన ఉత్సాహంతో ఇచ్ఛాపూర్వకంగా తమను తాము కచ్చితమైన రూపాంతరీకరణకు అర్పణ చేసుకుంటున్న జీవకణాలకు

అది న్యాయం చేసినట్లు అన్పించుకోదు

సందర్భం ఏదైనా, నేనిప్పటికే చెప్పినట్లు దాని కోసం, చాలా కాలం వేచి వుండవలసి వస్తుంది. అందుకు సిద్ధంగా వుండాలి.

— శ్రీమాత

'ఒక భవిష్యదర్శనం' పేరుతో శ్రీ నళినీకాంత గుప్తగారి సందేశాన్ని శ్రీమాత ఒక సాధకునికి గుర్తు చేసారు. అది యీ క్రింద యివ్వబడినది. శ్రీమాత చెప్పినది "సరిగ్గా దివ్యమైన రూపాంతరం చెందిన, వైభవోపేతమైన నా నూతన శరీరంలో నేను తిరిగి వచ్చి యిక్కడే వున్నాను. నేను ఇప్పటికీ మానవమైన అదే శ్రీమాతను. కలత చెందకు. నీ స్వంత ఆత్మ గురించిగాని, నీ ప్రగతి, సంసిద్ధుల గురించిగాని, ఇతరుల గురించిగాని దేనిని గురించీ ఆలోచించకు, పట్టించుకోకు, నేనిక్కడున్నాను. నా వైపు చూడు. నాలోకి చూడు. నాలో పూర్తిగా ప్రవేశించు. నా అస్తిత్వంలో కరిగిపో. నీ ప్రేమతో నా ప్రేమలో నిన్ను నువ్వు సర్వం లుప్తం చేసుకో. నీ సమస్యలన్నీ పరిష్కారమయిపోవడాన్ని, ప్రతిదీ పూర్తైపోవడాన్ని గమనిస్తావు. మిగిలినవన్నీ మరిచిపో. ప్రపంచాన్ని విస్మరించు. నన్ను మాత్రమే గుర్తు పెట్టుకో. నా ప్రేమతో నాలో ఒకటైపో...."

మూలం: నళినీకాంత గుప్త

(Collected Works of Nolinikanta Gupta, Vol. 6, p. 259)

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

దైవం ఉంటాడు నీలో — నీ ఆకాంక్ష మేరకే

ప్రశ్న: మనలో మనం — ప్రార్థించినపుడు లేదా ఒక సమస్యతో పెనుగులాడినపుడు — మాలో సందిగ్ధత, అపరిపక్వత ఉన్నప్పటికీ — మాలో ఇంకా తప్పులు, దుష్టసంకల్పం ఉన్నప్పటికీ — మేము నిజంగా, వినబడతామా? వినేది ఎవరు? మీరా — మాతో ఉన్న మీరా? — చెప్పగలరా మీరు — ఎలా — ఏ విధంగా ఉన్నారు మాతో?

శ్రీఅరవిందులు, మీరు, ఒకే ఒక్క చైతన్యం అని చెప్పారు. కాని వ్యక్తిగతమైన, ప్రత్యేక ఉనికి, మీకు శ్రీఅరవిందులకు ఉన్నవా — ప్రతిదీ తమ సొంతమైన ప్రత్యేక పాత్ర పోషిస్తూన్న రెండు విభిన్న వస్తువులున్నవా?

శ్రీమాత: నేను ఉన్నా నీతో, ఎందుకంటే, నేనే నీవు, లేదా నీవే నేను. నేను ఉన్నా నీతో — అంటే, అది సూచిస్తుంది ఒక ప్రపంచాన్ని ఎందుకనంటే వస్తువుల విషయాల ప్రపంచాన్ని — అన్ని స్తరాలలో, అన్ని తలాలలో — సర్వోన్నత చైతన్యం నుండి మిక్కిలి దిగువన ఉన్న భౌతిక చైతన్యం వరకు నీతో ఉన్నాను నేను.

ఇప్పటికి చాలా కాలం క్రితమే, ఆశ్రమంలో ప్రతి చోట, శ్రీఅరవిందులు ఉంచారు — మీ అందరకు తెల్సిన, ఈ హెచ్చరికను — "ఎల్లపుడు ప్రవర్తించు, శ్రీమాత నీవైపు చూస్తూ ఉన్నట్లుగా. ఎందుకంటె, నిజంగా, ఎప్పుడూ ఉంటుంది శ్రీమాత, నీ ఎదురుగా". ఇది కేవలం ఒక సమాసం కాదు, పదాలుకాదు — ఒక వాస్తవం. నేను ఉన్నా నీతో — ఒక దృఢపద్ధతిలో. ఎవరికి సూక్ష్మదృష్టి ఉంటుందో వారు చూడగలరు నన్ను. సాధారణ పద్ధతిలో, నా దివ్యక్రియాశక్తి ఎప్పుడూ ఉంటుందక్కడ (నీ వద్ద), నిరంతరం పనిచేస్తూ — నీ సత్తాలో మనస్తత్వ అంశాలను మారుస్తూ — వాటిని కొత్త సంబంధాలలోనికి సవరిస్తూ — నీ నైజంలో విభిన్న అంశాలను నీకు స్పష్టంగా చూపుతూ — వాటిలో వేటిని మార్చాలి, వేటిని వృద్ధి చేయాలి, వేటిని తిరస్కరించాలో — నీకు నీవే స్పష్టంగా చూడగల్గేందుకు, తెల్సుకోగల్గేందుకు.

అదీగాక, నీకూ నాకూ మధ్య — శ్రీఅరవిందుల బోధలు, నా బోధల వైపు మొగ్గు చూపినవారికీ, నాకూ, మధ్య — ఒక ప్రత్యేక వ్యక్తిగత అనుబంధం — ఒక

ముడి — ఉన్నది. దూరం లెక్కలోకి రాదిక్కడ — నీవు ఫ్రాన్సులో ఉండవచ్చు, లేదా ప్రపంచానికి అవతలి చివర ఉండొచ్చు, లేదా పాండిచ్చేరిలో ఉండొచ్చు — ఈ బంధమెల్లప్పుడు ఉంటుంది, సజీవంగా, సత్యంగా అనేది బాగా అర్థం చేసుకోబడినదే. పిలుపు వచ్చిన ప్రతిమారు — అక్కడ నేను తెల్సుకోవల్సిన అవసరమున్న ప్రతి మారు — ఒక శక్తిని, ఒక ప్రేరణను, ఒక రక్షణను, లేదా, ఇంకా దేనినైనా — పంపాల్సిన ప్రతిమారు — నాకు వస్తుంది, హఠాత్తుగా, ఒక సందేశం వంటిది. అప్పుడు చేస్తా నేను, అవసరమైనది.

ఒక్క విషయం జ్ఞాపకముంచుకో. శ్రీఅరవిందులు, నేను ఒకే చైతన్యం, ఒకే వ్యక్తి. అది — ఈ శక్తి — ఈ మా ఉనికి — మీ వ్యక్తి చైతన్యం గుండా పోయినపుడు — ధరిస్తుందొక రూపం. ఈ రూపం వేరు వేరుగా ఉంటుంది — నీ మనస్తత్వం, ఆకాంక్ష, అవసరం, నీ సత్తా యొక్క ప్రత్యేక మొగ్గు, అనుసరించి. ఇక్కడ నీ వ్యక్తిగత చైతన్యం — ఒక వడబోత లేదా సూచిక వంటిది — అని చెప్పొచ్చు — నే చెప్పదలిస్తే అలా. అనంతమైన దివ్య సంభావ్యతలలో ఒక దానిని, అది ఎంపిక చేస్తుంది, నిర్ణయిస్తుంది. నిజానికి దైవం ఇస్తాడు ప్రతి వ్యక్తికి కచ్చితంగా దేనినైతే అతడు దైవం నుండి ఆశిస్తాడో, దానిని. దైవం ఎక్కడో దూరంగా, క్రూరంగా ఉన్నాడని నీవు నమ్మితే, అతడు దూరంగా క్రూరంగా ఉంటాడు. ఎందుకంటే, నీ అంతిమ శ్రేయస్సుకు, దైవం యొక్క కోపాన్ని రుచి చూడాల్సి ఉంటుంది. అతడు — కాళిని కొలిచేవారికి కాళి, భక్తులకు పరమానందం, విజ్ఞాన అన్వేషకులకు విజ్ఞాన సర్వస్వం, భ్రాంతివాదికి సర్వాతీత నిర్వ్యక్తికత, నిరీశ్వరవాదులతో నిరీశ్వరవాది, ప్రేమికుని ప్రేమ ఎవరైతే అనుక్షణం, తన అంతరంగంలో, తన ప్రతి కదలికలో, 'ఆతనిని', తన అంతరంగ మార్గదర్శిగా, సహాయకునిగా, అనుభూతి చెందుతారో, వారి వద్ద ఉంటాడు 'ఆతడు' — దగ్గరగా, ఒక సోదరుని వలె, ఎప్పుడూ నమ్మకంగా, సహాయపడడానికి సిద్ధంగా ఉండే ఒక స్నేహితుని వలె ఇంకా నీవు నమ్మితే ఆతడన్నిటిని తుడిచిపారవేయుగలడని — ఆతడు తుడిచిపారేస్తాడు — నీ తప్పులను, పొరపాట్లను, అలుపు లేకుండా; నీ వనుభూతి చెందగలవు ప్రతి క్షణం'ఆతని' అనంత అనుగ్రహాన్ని. మిక్కిలి లోతైన ఈ ఆకాంక్షతో దేనినైతే నీ వాశిస్తావో 'ఆతడి' నుండి — అదే అవుతాడు దైవం, నిజంగా.

నీవీ చైతన్యంలోకి ఎప్పుడు ప్రవేశిస్తావో, అప్పుడు చూడగలవు — సవివరంగా,

ఒక్క చూపులో, వాటన్నిటిని దైవానికి మనుష్యులకు మధ్యగల మానవ సంబంధాల అనంత బాహుళ్యతను — అవి ఎంత అద్భుతంగా ఉంటాయో. మానవజాతి చరిత్రను గమిస్తే మనుష్యులు తన నెలా అర్థం చేసుకున్నారో, కోరుకున్నారో ఆశించారో, కలలు కన్నారో దాని కనుగుణంగానూ — పదార్థవాదితో పదార్థవాదిగా ఎలా ఉన్నాడో అదీగాక మానవచైతన్యం తనని తాను విశాలపర్చుకున్నప్పుడు అతడెలా ఎదుగుతూ ప్రతి రోజూ, ఎలా దగ్గరౌతూ, రోజు రోజుకీ, అతడెలా ప్రకాశవంతమవుతూ దైవం ఎంతగా పరిణామం చెందాడో చూడవచ్చు. స్వేచ్ఛ ఉంది ప్రతి ఒక్కరికి, ఎంపిక చేసేందుకు. దైవంతో మానవ సంబంధాలు — అంతులేని వైవిధ్యం గల మానవ సంబంధాలు — వారి పరిపక్వత — ప్రపంచచరిత్ర అంతటిలో, తీసిపారవేయ వీలులేని ఒక అద్భుతం. ఇదంతా, దైవసృష్టి మొత్తంలో ఒక్క సెకను మాత్రమే.

దైవం నీతో ఉన్నాడు, నీ ఆకాంక్ష మేరకే.

దీని అర్థం — సహజంగానే — నీ బాహ్యప్రకృతి యొక్క తెలివితక్కువ హఠాత్కోరికలకు — 'ఆతడు' తలవంచుతాడని కాదు. ఇక్కడ నే మాట్లాడుతున్నా — నీ సత్తా యొక్క సత్యం గురించి. అయినప్పటికీ తనకు తానుగా అనేక ఆకృతులు ధరిస్తాడు. బాహ్యప్రకృతి ఆకాంక్షల ననుసరించి, భక్తుల వలె నీవు — కలసి లేదా వేరుపడి, ఆనందంతో లేదా నిరాశతో — నీ నమ్మకాన్ననుసరించి జీవిస్తుంటే — భగవంతుడు కూడ, నీతో కలసి లేదా నీ నుండి వేరుపడి — ఉంటాడు, నీ నమ్మకాన్ననుసరించి. ఈ విధంగా నీ దృక్పథం — బాహ్య దృక్పథమైనప్పటికీ — చాలా ముఖ్యమైనదో — అది ఎలా ఒక అద్భుతమో — ఒక అసాధారణ సంఘటనో, వాటి సృష్టికర్తో. తెలుసుకుంటావు. ప్రతి క్షణం నీవు — (భగవంతునిచే) ఉద్ధరించబడాలని, దైవం వైపు లాగబడాలని, ఆశిస్తే — అతడొస్తాడు నిన్ను లేవదీయడానికి; అతడుంటాడు అక్కడ — నీకు దగ్గరగా, ఇంకా దగ్గరగా, ఎల్లప్పుడూ దగ్గరగా.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు


పండిత సత్వలేకర్ అభిభాషణ

గీతపై ఆంగ్లంలో రెండు సంపుటాల, వేదాలపై 30 సంపుటాల వ్యాఖ్యాత, సాహిత్య వాచస్పతి, గీతాలంకార బిరుదాంకితుడు, ప్రముఖవ్యక్తి అయిన వేదమూర్తి, మహా మహోపాధ్యాయ పండిత శ్రీపాద దామోదర సత్వలేకర్ తో ముఖాముఖి సంభాషణను, వారికి ఆశ్రమం పట్ల కలిగిన అభిప్రాయాన్ని ఒకసారి స్మరించి ఈ అధ్యాయాన్ని ముగిద్దాం. వేదాలు, వాటి అర్థ వివరణపై అధ్యయనంలో వారు తమ జీవితాన్నంతా వెచ్చించారు. 1960, జూలై 29 న ఆశ్రమానికి విచ్చేసి ఆశ్రమ గౌరవ అతిథిగా ఆగస్టు 17 వరకూ ఇచటనే ఉన్నారు. జూలై 30 వ తేదీన అంటే ఆయన వచ్చిన మరునాడే దివ్యజననిని వ్యక్తిగతంగా దర్శించి ఆమెతో ముఖాముఖి సంభాషించగలిగారు.


తన స్మృతులను జ్ఞప్తికి దెచ్చుకొని చెప్తుంటే ఆయన కళ్ళు ప్రకాశంతో నిండిపోయాయి. ఆశ్రమానికి రావాలని నిర్ణయించుకొన్న రోజు నుంచీ తన అంతరంగంలో దివ్యజనని సన్నిధానాన్ని అనుభూతి చెందుతున్నానని, సూరత్ నుండి మద్రాసు వరకూ ఒంటరిగానే (అప్పటి కాయన వయస్సు 93 సంవత్సరాలు) దారిలో ఏ యిబ్బందికీ లోను గాకుండా ప్రయాణించాననీచెప్పారు. మద్రాసులో రైలు దిగగానే ఆయనను అహ్వానిస్తూ, తీసుకు వెళ్ళడానికి వచ్చి యెదురు చూస్తూ వున్న ఒక పెద్దమనిషి వారిని తన కారులో ఆశ్రమానకి తీసుకొచ్చాడు.

దివ్యజననితో సమావేశం చాలా వరకు మౌనంలో, ధ్యానంలో గడిచిపోయింది. వివిధ వర్ణఛాయలుగల ఆరు నుండి యేడు ద్వారాలు తన హృదయంలో ఒకదాని తర్వాత మరొకటిగా ధ్యానసమయంలో తెరచుకోవడం చూచానన్నారు. తన అస్తిత్వమంతా ధవళకాంతిలో తానమాడడం కూడా చూచానన్నారు.

ఆయన ఇచట ఉన్నంత కాలం దివ్యసాన్నిధ్యాన్ని అధికాధికంగా అనుభవించారు. ఆశ్రమ కార్యకలాపా లన్నింటిలో దివ్యజనని శక్తి పనిచేయటాన్ని చూచి లోలోతుల దాకా చలించిపోయి "గత 50 లేక 60 సంవత్సరాల నుంచి నేను దేని కోసం ప్రార్థిస్తున్నానో, గతమంతా నేను ఏ స్వప్నం సాకారం కావాలని అభిలషించానో అది సజీవరూపం ధరించడం ఇచట నేను చూచాను. బహుశా వేదయుగం తర్వాత మొట్టమొదటిసారి ఈ విధమైన ప్రయత్నం ఇక్కడ జరుగుతోంది. సాధనకు



Physical education activities at the Ashram's Sports Ground, 1951



సంబంధించిన మొత్తం ప్రక్రియ, ఇచట వేదసూత్రాల నాధారం చేసుకొని జరుగుతోంది. వేదాలలో సూచించబడిన దాన్నంతా సఫలం చేసే ప్రయత్నం ఏదో రూపంలో ఇక్కడ జరుగుతోంది" అన్నారాయన.

ఆశ్రమాన్నంతా ఆయనకు చూపించమని దివ్యజనని రవీంద్రకు పురమాయించారు. పండిట్‌జీ తన వ్యక్తిగత అభిప్రాయాలను ఇలా తెలిపారని రవీంద్ర చెప్పాడు. వర్ణవ్యవస్థను రూపుమాపాలని తానెంతో శ్రమించానని, కాని ఆ జాడ్యం అంతమౌతుందన్న ధాఖలా కన్పించడం లేదని గాంధీజీ వాపోయిన విషయం మనందరికీ తెలుసు. పండిట్ సత్వలేకర్ : ఇక్కడ ఎక్కడా కూడా నేను వర్ణవివక్షతను లేశమాత్రం కూడా చూడలేదు. దివ్యజనని ఇచట తీసుకొచ్చిన మార్పు ఎంత గొప్పది! ఏదైమైనప్పటికీ, మనస్పుతో అర్థం చేసుకొని అభినందించే అంశమిది. కాని యువ బాలబాలికలు, ఆశ్రమంలో, పాఠశాలలో, ఆటస్థలంలో, ఇతర చోట్ల, నైతికత కేమాత్రం భంగం కలుగకుండా కలిసిపోయే స్వేచ్ఛను వారి కివ్వడం నిజంగా ఒక అద్భుత మహిమయే. విద్య, వ్యాయామ సంబంధమైన సహ-విద్య ఇచట యెటువంటి సమస్యకూ తావీయలేదు!

పండిట్‌జీ యింకా ఇలా అన్నారు "స్త్రీ, పురుషుల మధ్య దివ్యజనని యెన్నడూ భేదభావం చూపించలేదు. నిజాని కిదొక గొప్ప ప్రయోగం. పూర్తిగా ఒక అధ్యాత్మిక సమాజాన్ని స్థాపించాలని దివ్యజనని ప్రయత్నిస్తూన్నట్లు నాకు కన్పిస్తున్నది." లైంగిక భేదాన్ని వేదం పరిగణించదు. అంతరాత్మకు, అంతరాత్మకు మధ్య వుండే సంబంధ బాంధవ్యాల ఆధారంగా ఒక సమాజాన్ని సృజించాలని దివ్యజనని కోరుకొంటున్నట్లు కన్పిస్తోంది. దేహపరమైన భేదాలకు విలువ లేదు. తప్పులు యెంచాలని చూసే మనస్సు ఇక్కడా అక్కడా లోపాలను గుర్తించవచ్చు. అంతా పరిపూర్ణంగా ఉన్నదని నేను కూడా చెప్పలేను. కాని ప్రయత్నం మాత్రం వేదం దర్శించిన దిశవైపే నిశ్చయంగా ఉన్నదని, దివ్యజనని కృషి ఏదో ఒకనాడు తప్పక విజయం సాధిస్తుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను..

'' ఆశ్రమంలో ఒక శాఖకు దివ్యజనని 'ప్రోస్పరిటీ' అంటే 'ఐశ్వర్యం' అని పేరు పెట్టారు. ఆశ్రమంలో నివసించేవారికి సబ్బు, తలనూనె, బట్టలు వగైరా ఆ శాఖ నుండి అందిస్తారని సత్వలేకర్ కు చెప్పినప్పుడు ఆయన ఆనందంతో పరవశించారు. ఆధ్యాత్మికత ఒక యధార్థ రూపాన్ని సంతరించుకొనడాన్ని ఇచట

చూడగలుగుతున్నాను. సన్యాసం అనేది వేదంలో యెక్కడా లేదు. ప్రతి చోటా ఐశ్వర్యం, అగ్ని, క్రియాశక్తి, తేజస్సు, ఓజస్సుల కొరకే గాక వస్తుసంపద కోసం కూడా ప్రార్థించడం వుంది. పేదరికం ఎక్కడా కన్పించదు, భౌతిక వస్తువులను విసర్జించి, జీర్ణవస్త్రాలతో, ఓ చెట్టు మొదట్లో కూర్చొని కాలం గడిపే అనాథలా బ్రతికేవాళ్ళ ప్రస్తావన లేదు. ప్రపంచం నుండి, దాని వాసనల నుండి పలాయనం చిత్తగించడం, సర్వేశ్వరుని నిష్క్రియంగా జపిస్తూ కాలం గడపడం — ఇవి వైదిక జీవన విధానానికి చాలా దూరం. వేదకాలంలో జనకుని వంటివారు రాజ్యాలను పాలించారు. హితబోధ చేసేందుకు వశిష్టుని లాంటి ఋషులు రాజుల వెనుక నిలిచారు. ఋషులు యెన్నడూ ప్రపంచాన్ని కాదని తమను తాము అరణ్యాలకే పరిమితం చేసుకోలేదు. ఇటువంటి వ్యవహారాలన్నీ భారతదేశపు అంధకార శకానికి చెందినవి. దివ్యజనని సన్యాసం వైపు గాక సౌభాగ్యపు వైభవం వైపు చూస్తుండడం ఇక్కడ ఈరోజు చూస్తున్నాను. ప్రపంచాన్ని దాని విధికి దాన్ని వదలివేయాలను కోకుండా, అది ఆధ్యాత్మికతచే పాలించబడే, సిరిసంపదలచే వర్థిల్లాలని ఆమె కోరుకొంటోంది. ప్రపంచం మారాలి. వైదికయుగం పునర్జన్మించడాన్ని ఇక్కడ చూడగలరెవరైనా. ఏ వస్తువునూ నిషేధించగూడదు, లేక అలక్ష్యం చేయగూడదు. ప్రతిదీ తనకే స్వంతమైన ఒక సముచిత స్థానాన్ని దక్కించుకొన ప్రయత్నిస్తోంది"

నిష్కపట విశాల దృక్పథంలో స్వీకరించే ప్రజ్ఞాపాటవాల ఆయన మనస్సులాగానే ఆయన వెలువరించిన ఈ సత్యాలు ఆకట్టుకొంటాయి.

ఆటస్థలంలోని కార్యకలాపాలలో ఆయన చూపించిన ఆసక్తిని 93 సంవత్సరాల వయస్సుగల వారి నుండి ఆశించడం సహజంగానే అత్యాశ అవుతుంది. కాని మేం రవీంద్ర నుండి తెలుకొన్నదేమిటంటే ఆయన సామాన్యుల్లో ఒకరు కాదని. పురుషులు, స్త్రీలు, బాలురు, బాలికలు, సామూహికంగా కవాతు చేస్తూ, ఆటల్లో, వ్యక్తిగత క్రీడల్లో, వ్యాయామాల్లో సైతం కలిసి పాల్గొనడం చూసి తన సంతసాన్ని ఆపుకోలేక ఒక్కసారిగా బయట పడిపోయేవాడు.

"భారతదేశ పతనానికి యథార్థమైన కారణమేమిటో మీకు తెలుసా? దానికి కారణాలు రెండున్నాయి. ఆధ్యాత్మికత వైపు మరలడానికి మనం భౌతిక ప్రపంచాన్ని తృణీకరించాం. శ్రమకన్నా, అదృష్టానికే యెక్కువ ప్రాధాన్యత నిచ్చాం. మన మహిళలను అంటే సంఘంలో సగం మందిని పనికిరానివాళ్ల స్థాయికి దిగజార్చాం.

"ఎటువంటి దయనీయ స్థితి? స్త్రీలు శక్తిస్వరూపులనే భావనకు జన్మ నిచ్చిన దేశం, దేవతలకు 4 నుండి 8 వరకు హస్తాలను పురాణ పుటలలో కట్టబెట్టిన దేశం మనది. కాని దేవేరులకు నూట యెనిమిది హస్తాలున్నట్లు దర్శించింది ఈ దేశం. అటువంటి ఈ దేశమే స్త్రీలను పురుషుల కంటె దిగువస్థాయికి నెట్టివేసింది. వారికి వేదాధ్యయన హక్కు లేకుండా చేసింది. అంతకంటే దారుణంగా కుటుంబపు నాలుగు గోడల మధ్య బంధించి కదలకుండా చేసింది. సమాజంలో వారి స్థానాన్ని దిగజార్చుతూ వంటవారిగా, పిల్లల్ని కనే యంత్రాలుగా చేసివేసింది.

"నేను అనేక సంవత్సరాలుగా ప్రార్థిస్తూనే ఉన్నాను. ఓ ప్రభూ! వెనుకటి కాలంలో లాగా మా స్త్రీలు తమ న్యాయసమ్మతమైన స్థానానికి తిరిగి లేవగలిగేటట్లు అనుగ్రహించు" అని.

స్త్రీల పురోభివృద్ధి కని ఇప్పుడేం జరుగుతున్నదో అది యధార్థంగా పురోభివృద్ధికి వారిని చాలా దూరం చేస్తోంది. యధార్థమైన పురోగతి యొక్క శుభసూచనలను నేనిక్కడ చూస్తున్నాను. స్త్రీలను ఉద్ధరించే బాధ్యతను దివ్యజనని తానే స్వీకరించినట్లిక్కడ కన్పిస్తోంది. మళ్ళీ చెప్తున్నాను. వేద ఆదర్శం ఇచట రూపం దిద్దుకొంటున్నదని నేను పసిగట్టాను. సత్వలేకర్ జీ ప్రకటనలో దివ్యజనని వాణి ధ్వనిస్తున్నది. "వారి వయోపరిమితిని బట్టి మనుష్యులు యువకులా, వృద్ధులా అని "తేల్చి చెప్పలేం. అతని వయస్సెంత వున్నా, సదా ముందుకు ముమ్ముందుకే అడుగు వేసేవాడు నిత్య యౌవనుడే. అలా చేయలేనివాడే వృద్ధుడు." వేదాన్ననుసరించి వృద్ధాప్యం 116 సంవత్సరాల తర్వాత మొదలౌతుంది. 80 సంవత్సరాల వయస్సు రానంత వరకు అతడు పూర్ణయువకుడు కానట్లే. 116-120 సంవత్సరాల వయస్సు తర్వాత మాత్రమే వృద్ధాప్యం ప్రవేశించ సాహసిస్తుంది. అంతకు ముందు మృత్యువుకు దరిచేరినా నిజమైన సాధకుడు దానిని తిరస్కరించగలడు. తన జీవితమంతా ఒక నిరంతరం యజ్ఞం అనీ, ఆ యజ్ఞ నివేదన పూర్తి గాకుండా తన నాపవద్దనీ అతడు మృత్యువుకు చెప్తాడు".

ఆయనింకా ఇలా అన్నాడు: "మహాభారత యుద్ధం నాటికి అర్జునుడికి 72 యేళ్ళు, అతన్ని నిండు యౌవనంతో ఉన్నవాడని వర్ణించారు. వాళ్ళందరిలో వృద్ధుడు భీష్ముడు. ఆయన వయస్సు అప్పటికి దాదాపుగా 170 సంవత్సరాలు. మరీ అంత వెనక్కు పోకుండా 1400 సంవత్సరాల నాటి మాటే చూద్దాం. భారతీయ

పట్టణాల సందుగొందుల్లో కూడా 140 సంవత్సరాల వయసున్నవాళ్ళను కలుసుకొన్న వాస్తవం చైనా యాత్రికులకు సంబంధించిన పత్రాల్లో కన్పిస్తుంది. దివ్యజనని చెప్పిన మాట పూర్తిగా సత్యం".

ఆయన ఆశ్రమం నుండి తిరిగి వెళ్ళిపోయే సందర్భంలో జరిగిన చివరి ముఖాముఖి సమావేశంలో దివ్యజనని అతనికి "ఆశ్రమానికి నీవెప్పుడొచ్చినా దీన్ని నీ స్వంత యిల్లనుకో" అని చెప్పారు.

అతడు స్వస్థలానికి వెళ్ళిన పిదప ఇలా వాపోయారు. "నేనిక్కడ స్వగృహానికి యెంతో దూరంగా వుంటున్న ఒక ప్రవాసిగా జీవిస్తున్నట్లనిపిస్తోంది. ప్రతి ఉదయం బాల్కనీ దర్శనం లభిస్తోంది. దివ్యజనని సాన్నిధ్యాన్ని అనుభూతి చెందకుండా ఒక్కరోజు కూడా గడవడం లేదు."

(శ్రీఅరవిందాశ్రమంలో జీవితం: నారాయణ ప్రసాదు 2010 ముద్రణ. పేజీలు 207-212)

అనువాదం: కె. వి. రావు